

హేమంత్ నింబాల్కర్‌ను గోల్డ్‌మెడల్‌తో సత్కరిస్తున్న సీఎం సిద్దరామయ్య

ఏకోపాధ్యాయ పాఠశాలలకు.. పొంచి ఉన్న ముప్పు..!

- పునః ప్రారంభానికి ముందే డోలాయమానం
- ఏడు వేల పాఠశాలలపై విలీనం కత్తి



బెంగళూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలకు ప్రాధాన్యం ఇస్తున్నామని, ఇందుకోసం బడ్జెట్‌లో ప్రత్యేక కేటాయింపులు ఉన్నాయని, మౌలిక సదుపాయాలు సమగ్రంగా సమకూరుస్తున్నామని పేదల పిల్లలకు గుణాత్మకమైన విద్య అందించేందుకు కట్టుబడ్డామని ప్రభుత్వ ప్రతినిధులు నిత్యం చెబుతున్నా ఆచరణలో విద్యావ్యవస్థ ఇందుకు భిన్నంగా ఉంది. ఇప్పుడిప్పుడే ప్రధానమైన పది, పీయూ పరీక్షలు ముగిశాయి. ప్రాథమిక నుంచి ఉన్నతస్థాయి తరగతుల పరీక్షలు మరికొన్ని రోజుల్లో ముగియనున్నాయి. రెండు నెలల్లో ప్రారంభం కావాల్సిన అకడమిక్‌కు ముందే రాష్ట్రమంతటా పేద విద్యార్థులు డోలాయమానంలో పడ్డారనే పరిస్థితి ఏర్పడుతోంది. ప్రత్యేకించి ఏకోపాధ్యాయ బడులకు (సింగిల్ టీచర్ స్కూళ్లు) గండం ముంచుకొస్తోంది. ఓవైపు ప్రాథమిక స్థాయిలోనే ఇంగ్లిష్ మీడియంను ప్రారంభిస్తామని చెబుతున్నా ఉన్న పాఠశాలలకు ఎసరు పెడతారనే భయం వెంటాడుతోంది.

● పాఠశాలల విలీనం, మూసివేతకు తీవ్రమైన వ్యతిరేకత ఉన్నా ఏకోపాధ్యాయ పాఠశాలలను విలీనం చేసేందుకు విద్యాశాఖ సిద్ధమైనట్టు తెలుస్తోంది. 2023-24 విద్యాసంవత్సరంలో ఏకోపాధ్యాయ పాఠశాలలను గుర్తించి, వాటిని సమీపంలోని ఇతర పాఠశాలలకు విలీనం చేయదలిచారు. ఇందుకోసం సంబంధిత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులకు నచ్చచెప్పే ప్రయత్నాలు ముమ్మరమైనట్టు తెలుస్తోంది. తొలి విడతలో 8 జిల్లాల పరిధిలో ప్రయోగాత్మకంగా ప్రాథమిక పాఠశాలలను విలీనం చేయదలిచినట్టు తెలుస్తోంది. ఇందులో విద్యాశాఖ మంత్రి మధుబంగారప్ప జిల్లా శివమొగ్గను కూడా ఎంపిక చేశారు. విలీనం చేసిన ప్రాంతాలలో మోడల్ స్కూళ్లను ఏర్పాటు చేసే ఆలోచన ఉన్నట్టు సమాచారం.



● విద్యాసంస్కరణల కమిషన్ ప్రస్తావన

పదిమంది కంటే తక్కువమంది విద్యార్థులు ఉన్న పాఠశాలలు గుణాత్మకమైన విద్య అందడం లేదనే విమర్శలు ఉన్నాయి. సింగిల్ టీచర్ ఉన్నందున నాలుగైదు తరగతుల విద్యార్థులకు ఒకేసారి సమగ్రంగా పాఠాలు బోధించలేకపోతున్నారని, సదరు ఉపాధ్యాయుడు సెలవు పెడితే పాఠశాలలకు తాళం వేస్తారు. ఇక హెడ్మాస్టర్‌గా మధ్యాహ్న భోజనం పర్యవేక్షణతోపాటు బ్లాక్‌స్థాయి, జిల్లాస్థాయిలో జరిగే మీటింగ్‌లకు తప్పనిసరిగా హాజరు కావాల్సి ఉన్నందున నెలకు నాలుగైదు రోజులకుపైగా పాఠశాల కొనసాగదు. ఇలా నెలలో పది రోజులకుపైగా పాఠశాలలు కొనసాగవు. అదనంగా టీచర్ సెలవు పెడితే అది కూడా తాళం వేసే ఖాతాలోకి చేరిపోతుంది. విద్యా సంస్కరణల కమిషన్ గత ప్రభుత్వానికే పది మందిలోపు విద్యార్థులు ఉండే పాఠశాలలను విలీనం చేయాలని నివేదిక ఇచ్చింది. అందుకు స్థానికులు ఎక్కడికక్కడ వ్యతిరేకించారు. పాఠశాలలు దూరమైతే వాహన వ్యవస్థను ఏర్పాటు చేస్తామని విద్యాశాఖ సూచించింది. అయితే అది సాధ్యం కాదని తేలిపోయింది.

● 20శాతం పాఠశాలలకు తాళాలే

విద్యాసంస్కరణల కమిషన్ ప్రస్తావించిన నివేదిక ప్రకారమైతే పదిమందిలోపు విద్యార్థులు ఉండే 3,457 ప్రాథమిక పాఠశాలలను గుర్తించారు. రెండేళ్ల వ్యవధిలో అటువంటి పాఠశాలల సంఖ్య 6వేలకు చేరినట్టు తెలుస్తోంది. ఇలా తక్కువమంది విద్యార్థులు ఉన్నారని పాఠశాలలు మూసివేస్తే సుమారు 50వేలమంది విద్యార్థుల భవిష్యత్తు ఆందోళనకరం కానుంది. మరోవైపు రాష్ట్రంలోని 1,078 ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల అడ్మిషన్లు లేనిస్థితికి చేరాయి. వరుసగా మూడేళ్లపాటు అడ్మిషన్లు లేకపోవడంతో ఐదో తరగతి దాకా చదివినవారు ప్రాథమికోన్నత పాఠశాలకు మరోచోటుకు వెళ్లారు. ఇలా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగడం లేదు. ఏటా ఐదో తరగతి పూర్తి చేసినవారు ఆరో తరగతికి మరో పాఠశాలకు వెళ్తారు. ఇది సహజమైన విధానమే అయినా ఒకటో తరగతిలో చేరేందుకు విద్యార్థులు ముందుకు రావడం లేదు. ఇదే ప్రాథమిక పాఠశాలలకు సవాల్‌గా మారుతోంది. కొడగు జిల్లాలో 64 పాఠశాలలు విలీనం కానున్నాయని జిల్లా విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.

● రాష్ట్రంలో 23,436 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 6వేల పాఠశాలల్లో పదిమందిలోపు విద్యార్థులు ఉన్నారు. 7,821 పాఠశాలల్లో సింగిల్ టీచర్ పర్యవేక్షిస్తున్నారు. గత ఏడాది 1078 పాఠశాలల్లో అడ్మిషన్లు జరగలేదు. జీరో అడ్మిషన్లు కొనసాగిన పాఠశాలల్లో 1572లమంది ఉపాధ్యాయులు ఉన్నారు. తక్కువమంది విద్యార్థులు ఉండే పాఠశాలలకు కేంద్రీకృతంగా మోడల్ స్కూళ్లను ప్రారంభించదలిచారు. విలీనం లేదా కారణం ఏదైనా విద్యార్థి డ్రాప్‌అవుట్ కారాదని కొత్త విధానాన్ని తీసుకురాదలిచారు. దశాబ్దాలకాలంగా ఉన్న పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు తాగునీరు, శౌచాలయాలు లేవు. మూతపడే పాఠశాలలకు అనుబంధంగా మోడల్‌స్కూళ్లను తెరుస్తారంటే సాధ్యమయ్యేది కాదని విద్యానిపుణులు అభిప్రాయపడుతున్నారు. విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే ఈ గందరగోళం నెలకొనడంతో గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థుల పరిస్థితి అయోమయంగా మారింది.

రాష్ట్రాభివృద్ధికి శాంతిభద్రతలు కీలకం: సీఎం

బెంగళూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధికి శాంతిభద్రతలు కీలకమని సీఎం సిద్దరామయ్య అన్నారు. శాంతిభద్రతలతోపాటు పెట్టుబడులు, అభివృద్ధి, ఉద్యోగాల సృష్టి వంటివి అవినాభావ సంబంధాలు కలిగినవన్నారు. నిరుద్యోగం పెను సవాల్‌లాంటిదని నిభాయించాలంటే శాంతియుత పాలన, భద్రత ముఖ్యమన్నారు. బుధవారం కోరమంగలలోని పరేడ్ మైదానంలో పోలీస్ ఫ్లాగ్‌డేను పురస్కరించుకుని ముఖ్యమంత్రి మెడల్స్‌ను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ గడిచిన మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ముఖ్యమంత్రి పతకాలను ఒకేసారి ఇచ్చామన్నారు. సాంకేతిక అభివృద్ధితో సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, వాటిపట్ల ప్రజలలో చైతన్యంతోపాటు పోలీసులు మరింత నైపుణ్యం సాధించాల్సి ఉందన్నారు. జర్మన్ ప్రధాని, ప్రతినిధులు రాష్ట్ర పోలీసు నైపుణ్యాన్ని, వృత్తి విధానాన్ని కొనియాడారని కితాబిచ్చారు. ఇటీవల రెండేళ్లలో రాష్ట్రంలో నేరాల సంఖ్య తగ్గడం సంతోషకరమన్నారు. రాష్ట్రంలో నక్సలిజం పూర్తిస్థాయిలో లేకుండా చేసేందుకు తోడ్పడిన ఇంటెలిజెన్స్ విభాగం ముఖ్యులు హేమంత్ నింబాల్కర్‌ను ప్రత్యేకంగా బంగారు పతకంతో సత్కరించారు. హోంమంత్రి పరమేశ్వర్, హోంశాఖ ముఖ్యకార్యదర్శి ఉమాశంకర్, డీజీపీ అలోక్‌మోహన్, సీఎం ముఖ్యకార్యదర్శి ఎల్‌కే అతీక్ తదితరులు ఉన్నారు.

జగ్గేశ్, సాయికుమార్‌కు 'రాయల' పురస్కారాలు

బెంగళూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ప్రముఖ నటులు, రాజ్యసభ సభ్యుడు జగ్గేశ్, దక్షిణాది ప్రముఖ నటుడు సాయికుమార్‌లను శ్రీకృష్ణదేవరాయల పురస్కారాలకు ఎంపిక చేసినట్టు తెలుగు విజ్ఞాన సమితి అధ్యక్షుడు రాధాకృష్ణరాజు వెల్లడించారు. 72వ ఉగాది ఉత్సవాలను ఆదివారం వయ్యాలికావల్‌లోని శ్రీకృష్ణదేవరాయల కళామందిరంలో జరుపుతున్నామన్నారు. ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ ఉపసభాపతి కే రఘురామకృష్ణరాజు, కన్నడ సంస్కృతిశాఖ మంత్రి శివరాజ్ తంగడిగలు ముఖ్యులుగా పాల్గొంటారన్నారు. 6న ఉదయం 10 గంటలనుంచే ఉత్సవాలు ప్రారంభం అవుతాయన్నారు. సినిమారంగంలో ఎనలేని సేవలు చేసిన ఇద్దరు నటులకు రాయల పురస్కారాలతో గౌరవిస్తున్నామన్నారు. తెలుగు విజ్ఞాన సమితి విద్యాసంస్థ అధ్యక్షుడు శ్యామరాజుతోపాటు కార్యవర్గ సభ్యుల పర్యవేక్షణలో కార్యక్రమాలు జరుగుతాయన్నారు. తెలుగు అభిమానులు, ప్రవాసాంధ్రులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

సీఐపై లోకాయుక్త వల

పసిగట్టి పరారైన సీఐ.. దొరికిపోయిన కానిస్టేబుళ్లు



సీఐ కుమార్

బెంగళూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): అన్నపూర్ణేశ్వరి నగర్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న సీఐ కుమార్ లోకాయుక్త వల నుంచి తృటిలో తప్పించుకున్నాడు. లోకాయుక్త దాడులను పసిగట్టి.. అక్కడి నుంచి పారిపోయాడు. ఓ తప్పుడు కేసు నమోదు చేసి, రూ.4కోట్ల విలువైన ఇంటిని విక్రయించేందుకు ఓ కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తెచ్చిన ఆయన చిక్కుల్లో పడ్డారు. ఆయన వేధింపులు భరించలేని కాంట్రాక్టర్ కుటుంబీకులు లోకాయుక్తను ఆశ్రయించారు. దీంతో మంగళవారం సాయంత్రం నాగరబావిలోని ఓ హోటల్‌లో డీల్ జరుగుతుండగా లోకాయుక్త అధికారులు దాడి చేశారు. ఇద్దరు కానిస్టేబుళ్లు పట్టుబడగా సీఐ కుమార్ పరారీ అయ్యాడు. అవినీతి నియంత్రణ చట్టం కింద కానిస్టేబుళ్లను అరెస్టు చేశారు. సివిల్ కాంట్రాక్టర్ చెన్నేగౌడ భార్య అనుషను సబ్ ఇన్‌స్పెక్టర్ ఇటీవల కొన్నిరోజులుగా వేధింపులకు గురి చేస్తున్నారు. చెన్నేగౌడకు చెందిన రూ.4కోట్ల విలువైన ఇంటిని విక్రయించాలని ఒత్తిడి తెచ్చారు. రూ.60లక్షలకే రిజిస్ట్రేషన్ చేయించాలని సీఐ ఇబ్బంది పెట్టాడు. ప్రభుత్వ ఉద్యోగి అయిన చెన్నేగౌడ భార్య అనుషపై గతంలో నమోదైన ఓ కేసుకు సంబంధించి వ్యతిరేకంగా బి రిపోర్టు రాస్తానని ఇబ్బంది పెట్టినట్టు తెలుస్తోంది. ఇల్లు రాసివ్వాలని కొన్ని రోజులుగా డిమాండ్ చేస్తున్నారు. సీఐ కుమార్ కొందరు రౌడీలను చెన్నేగౌడ ఇంటికి పంపి బెదిరింపులకు పాల్పడ్డారు. సీఐ కుమార్‌కు బంధువులైన గవిగౌడ, దివ్యల పేరిట అగ్రిమెంట్ చేసుకునేందుకు ఓ హోటల్‌లో భేటీ అవుతున్నారని తెలుసుకుని లోకాయుక్త దాడి చేసింది. పరారైన సీఐ కోసం గాలింపులు జరుపుతున్నారు. ఈ వివాదంలో ఇద్దరు కానిస్టేబుళ్ల ఉమేశ్, అనంత్‌తోపాటు మరో ముగ్గురిని లోకాయుక్త అధికారులు అరెస్టు చేశారు. సీఐ కుమార్ సీఎం గోల్డ్‌మెడల్‌కు ఎంపిక కావడం గమనార్హం.

జానపద కళలు.. జీవన విలువలకు నిదర్శనం

- ఆర్ట్స్ కళాశాల ఉత్సవంలో చీఫ్ సెక్రటరీ డాక్టర్ శాలినీ రజనీశ్

బెంగళూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): దేశంలో కర్ణాటక వైవిధ్యమైన బహుళ సంస్కృతికి కేంద్రమని, జానపద కళలు జీవన విలువలకు నిదర్శనమని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ శాలిని రజనీశ్ అన్నారు. ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో బుధవారం కన్నడసంఘం, రంగచారక ఫౌండేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో 'హెజ్జె గెజ్జె' పేరిట ప్రిన్సిపాల్ వి.టి. శ్రీనివాసనాయక్ అధ్యక్షతన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ శాలిని రజనీశ్ మాట్లాడుతూ డిగ్రీ చదివే విద్యార్థులు అనుక్షణం తీరికలేకుండా ఉంటారని, అయితే మన సంస్కృతి, సంప్రదాయం, జానపదం విద్యార్థులకు నేర్పించిన ఆర్ట్స్ కళాశాల అధ్యాపక బృందాన్ని ప్రత్యేకంగా కొనియాడారు. విద్యార్థులతో చర్చాగోష్టి జరిపారు. సంస్కృతి, సంస్కారం కూడా నేర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ పుట్టణ్ణ, పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యురాలు డాక్టర్ ఆర్ కావేలమ్మ, కళాశాల విద్యాశాఖ డైరెక్టర్ డాక్టర్ శోభాలు ముఖ్యులుగా పాల్గొన్నారు. కన్నడ సంఘం సంచాలకులు, కన్నడ అధ్యాపకులు డాక్టర్ రుద్రేశ్ అదరంగి సారథ్యంలో కార్యక్రమాలు జరిగాయి. రుద్రేశ్ అదరంగి మాట్లాడుతూ ఏటా కన్నడసంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు సాంస్కృతిక, జానపద కళలపై శిక్షణలు ఇస్తున్నామన్నారు. కేవలం నెలన్నర వ్యవధిలో విద్యార్థులు ఎంతో ఆసక్తితో నైపుణ్యత సాధించారన్నారు. సహకరించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. రంగచారక ఫౌండేషన్‌కు చెందిన హిదాయత్ అహ్మద్ నేతృత్వంలో వందలాదిమంది విద్యార్థినులు డొళ్లకుణిత, లంబాణి నృత్యం, కొడవ నృత్యం, కంసాళె, రంగకుణిత, హెజ్జెకుణిత, డప్పు కళలో తర్ఫీదు ఇచ్చారన్నారు. డొళ్లకుణిత, బంజారా, బసవతత్వాలకు అనుగుణంగా సాగిన నృత్యాలు ప్రత్యేకత అనిపించాయి.



డొళ్ళుకుణిత ప్రదర్శనలో విద్యార్థులు



చీఫ్ సెక్రటరీ డాక్టర్ శాలినీరజనీశ్‌తో కళాబృందాలు

రేపు కేఎస్‌ఐటీ రజతోత్సవ ఆడిటోరియం ప్రారంభం

బెంగళూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): కమ్మవారిసంఘం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (కేఎస్‌ఐటీ) రజతోత్సవ ఆడిటోరియాన్ని ఈనెల 4న ప్రారంభించనున్నారు. కమ్మవారిసంఘం అధ్యక్షుడు ఆర్ రాజగోపాల్‌నాయుడు బుధవారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. ముఖ్య అతిథిగా విచ్చేసే రవాణాశాఖ మంత్రి రామలింగారెడ్డి శుక్రవారం ఉదయం 9.30 గంటకు క్యాంపస్‌లో ఆడిటోరియాన్ని ప్రారంభిస్తారన్నారు. మాజీ మంత్రి కట్టా సుబ్రహ్మణ్యం నాయుడు, కమ్మవారిసంఘం సలహా కమిటీ చైర్మన్ కె కృష్ణ అతిథిగా విచ్చేస్తారన్నారు. సంఘం అధ్యక్షుడు రాజగోపాల్‌నాయుడు కార్యక్రమానికి అధ్యక్షత వహించనుండగా సంఘం గౌరవ కార్యదర్శి ఆర్ లీలాశంకర్‌రావు, కోశాధికారి నీరజాక్షులు నాయుడు, కేఎస్‌జీఐ సీఈఓ డాక్టర్ కేవీఏ బాలాజి, కేఎస్‌ఐటీ ప్రిన్సిపాల్ డాక్టర్ దిలీప్‌కుమార్ పాల్గొంటారన్నారు.



మాట్లాడుతున్న కమ్మవారిసంఘం అధ్యక్షుడు రాజగోపాల్‌నాయుడు



నిరసనలో పాల్గొన్న నాయకులు, అభిమానులు

ధరల పెంపు కాంగ్రెస్ ఆరో గ్యారెంటీ

- ఏసీ గదులు వీడితే ప్రజల కష్టాలు తెలుస్తాయి
- నిరవధిక ధర్నాకు బీజేపీ సన్నద్ధం

బెంగళూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నిత్యావసర ధరలు పెంచడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం అన్నివర్గాల ప్రజలకు ఆరో గ్యారెంటీని అమలు చేస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం పాలు, డీజిల్, విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా రాష్ట్ర బీజేపీ ఆధ్వర్యంలో నిరవధిక ధర్నాకు బుధవారం శ్రీకారం చుట్టారు. తొలుత శాసనసభ్యులు విధానసౌధ ప్రాంగణంలోని కెంగల్ హనుమంతయ్య విగ్రహం వద్ద నిరసన తెలిపారు. అనంతరం ఫ్రీడంపార్కులో భారీ నిరసన చేపట్టారు. పార్టీ అధ్యక్షుడు విజయేంద్ర మాట్లాడుతూ ఇచ్చిన హామీలను నెరవేర్చామని గొప్పలు చెప్పుకొనే ముఖ్యమంత్రి సామాన్యవర్గాలకు నిత్యం అవసరమైన పాల ధరలు పెంచారన్నారు. రాత్రికి రాత్రి లీటరు డీజిల్‌పై రూ.2పెంచారని తద్వారా అన్ని వస్తువులపైనా భారం పడనుందన్నారు. కుర్చీ భద్రత కోసం సీఎం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఏసీ గదులు వీడి ఉత్తర కర్ణాటక ప్రాంతాల్లో పర్యటిస్తే వాస్తవాలు తెలుస్తాయన్నారు. రాయచూరు, కొప్పళ, బెళగావి, బీదర్ జిల్లాల్లో మంత్రులతోపాటు వెళ్తే అక్కడి ప్రజల కష్టాలు చూడవచ్చన్నారు. రాజులకాలంలో చక్రవర్తులు రహస్యంగా రాజ్యంలో పర్యటించి సమస్యలు తెలుసుకునేవారని, కనీసం పగటివేళ వెళ్తే ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారో తెలుస్తుందన్నారు. మీకు కుర్చీ భయం ఉండే డీసీఎం డీకే శివకుమార్‌ను కూడా వెంటబెట్టుకోవాలన్నారు. విత్తనగింజల ధరలు కూడా పెంచారన్నారు. గృహలక్ష్మి పేరిట నెలకు ఇంటికి రూ.2 వేలు ఇచ్చి అంతకుమించి కొరడాతో కొడుతున్నారన్నారు. ఈనెల 7నుంచి జనాగ్రహ యాత్ర ప్రారంభిస్తామన్నారు. ప్రతిపక్షనేత అశోక్ మాట్లాడుతూ పేరుకే సిద్దరామయ్య సీఎం అని ప్రస్తుతం ఆయన నిద్దరామయ్య అయ్యారని వ్యంగ్యం చేశారు. బీజేపీపై 40శాతం కమీషన్ ఆరోపణలు చేసి ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చి నిలువునా ముంచుతున్నారన్నారు. బీజేపీ అగ్రనేత యడియూరప్ప, పరిషత్ ప్రతిపక్షనేత ఛలవాది నారాయణస్వామి, ఎమ్మెల్యేలు అశ్వత్థనారాయణ, సీటీ రవి, రవికుమార్‌తోపాటు పార్టీ ప్రధాన కార్యదర్శి రాజీవ్, రాష్ట్ర పార్టీ వ్యవహారాల సహాయ ఇన్‌చార్జ్ సుధాకరరెడ్డి పాల్గొన్నారు.



విధానసౌధ వద్ద బీజేపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ధర్నా

ఢిల్లీలో కర్ణాటక భవన్-1 ప్రారంభం



కర్ణాటక భవన్-1 ప్రారంభోత్సవంలో మల్లికార్జున ఖర్గే, సీఎం సిద్దరామయ్య

బెంగళూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో నూతనంగా నిర్మించిన కర్ణాటక భవన్-1 (కావేరి)ని రాజ్యసభ ప్రతిపక్షనేత, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సమక్షంలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. రాజ్యసభ సభ్యుడు జైరాం రమేశ్, సుధామూర్తి ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, మంత్రులు సతీశ్ జార్కిహొళి, మహదేవప్ప, రాజణ్ణ, కేహెచ్ మునియప్ప తదితరులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రి గడ్కరీతో భేటీ

ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి సిద్దరామయ్య కేంద్ర భూ ఉపరితల రవాణాశాఖ మంత్రి నితిన్‌గడ్కరీతో భేటీ అయ్యారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న పలు జాతీయ రహదారి ప్రాజెక్టుల గురించి చర్చించారు. మంత్రులు సతీశ్‌జార్కిహొళి, ఢిల్లీ ప్రతినిధి జయచంద్ర, ఆర్థిక సలహాదారుడు బసవరాజరాయరెడ్డి, సీఎం రాజకీయ కార్యదర్శి గోవిందరాజు తదితరులు ఉన్నారు. జాతీయ రహదారి మైసూరు నగరంలో 275పై మణిపాల్ ఆసుపత్రి వద్ద ఫ్లై ఓవర్ నిర్మాణం, 30.35 కి.మీ పొడవైన హుబ్బళ్ళి-ధారవాడ అష్టపథ బైపాస్ నిర్మాణం, 369ఈ (సిగందూరు బ్రిడ్జి) శరావతి బ్యాక్ వాటర్‌పై బ్రిడ్జి నిర్మాణం, 167 హగరి-జడ్చెర్ల సెక్షన్‌లో కృష్ణానదిపై 180.865 కిలోమీటర వద్ద బ్రిడ్జి నిర్మాణం, బెంగళూరు నగరం హెబ్బాళ జంక్షన్‌లో జాతీయ రహదారి 44పై ఫ్లై ఓవర్ నిర్మాణం ఇలా పలు ప్రాంతాల్లో పెండింగ్‌లో ఉన్న ఫ్లై ఓవర్ నిర్మాణాల గురించి కేంద్రమంత్రికి సమగ్రంగా వివరించినట్టు సీఎం మీడియాకు తెలిపారు.



కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీకి బొకే అందిస్తున్న సీఎం

టీఎంసీ నీరు నిల్వ చేయడమే లక్ష్యం

ఏడాదిలో 1.10 కోట్ల ఉపాధి పనిదినాలు కల్పించాం

డ్వామా పీడీ సలీం బాషా



అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నీటి కుంటల నిర్మాణంతో జిల్లాలో టీఎంసీ నీటిని నిల్వ చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని డ్వామా పీడీ సలీంబాసా తెలిపారు. ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న పనులు, జిల్లాలో పురోగతి అంశాలపై డ్వామా పీడీతో 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూ..

ప్రశ్న: నీటి కుంట అంటే ఏంటి? దాని ఉపయోగం ఏంటి?

జవాబు: రైతుల పొలాల్లో వర్షపునీటిని అక్కడే ఇంకింపజేయడానికి తీసే గుంతనే నీటికుంట అంటారు. దీని నిర్మాణంతో పొలాలకు మందులు కొట్టేందుకు, పశువులు, పక్షులకు తాగునీటి సదుపాయం కల్పించడంతో పాటు ఆరుతడి పంటలను సాగుచేసుకునే అవకాశాలుంటాయి.

ఇంటర్వ్యూ interview

ప్రశ్న: జిల్లాకు ఎన్ని నీటికుంటల నిర్మాణాన్ని లక్ష్యంగా నిర్ణయించారు?

జవాబు: జిల్లాలో జూన్ చివరి నాటికి 9వేల నీటికుంటల నిర్మాణం చేపట్టాలని లక్ష్యాన్ని నిర్దేశించారు. ఇప్పటి వరకు 550 నిర్మాణం పూర్తి చేశాం. గడువులోగా లక్ష్యాన్ని అధిగమించేందుకు ప్రణాళికతో ముందుకెళ్తున్నాం. 9వేల నీటి కుంటల నిర్మాణం పూర్తిచేస్తే టీఎంసీ నీటిని నిల్వ చేసుకునే అవకాశం జిల్లాకు లభిస్తుంది.

ప్రశ్న: ఇప్పటి వరకు ఈ ఆర్థిక సంవత్సరంలో ఎన్ని ఉపాధి పనిదినాలు కల్పించారు?

జవాబు: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 1.13 కోట్ల పనిదినాలు లక్ష్యం పెట్టుకోగా... ఇప్పటి వరకు 1.10కోట్ల పనిదినాలు పూర్తి చేశాం. కనీస వేతనం రూ.265 కాగా.. ప్రస్తుతం రూ.263 చొప్పున జమవుతోంది. ప్రస్తుతం పండుగల కారణంగా కొద్దిగా పనిదినాలు తగ్గాయి.

ప్రశ్న: జిల్లాలో ఎన్ని జాబ్‌కార్డులు ఉన్నాయి.. ఎంతమంది కూలీలు ఉన్నారు...?

జవాబు: జిల్లాలో 3.14 లక్షల జాబ్‌కార్డులు ఉన్నాయి. ఇందులో 4.66 లక్షల మంది కూలీలు ఉన్నారు. ఎస్సీలకు సంబంధించి 89వేల జాబ్‌కార్డులు ఉండగా.. 1.10 లక్షల మంది కూలీలు ఉన్నారు. 10వేలు ఎస్టీ జాబ్‌కార్డులు ఉండగా.. 20వేల మంది కూలీలు ఉన్నారు. మొత్తంగా 3 లక్షల మంది మహిళా కూలీలు ఉన్నారు. 59వేల జాబ్‌కార్డులకు వందరోజుల పనిదినాలు లక్ష్యం కాగా.. ఇప్పటి వరకు 19వేల జాబ్‌కార్డులకు పూర్తి చేశాం.

● వేసవి రాకతో డిమాండ్ ● చల్లటి తాగునీటి కోసం కొనుగోలు ● ఎన్నెన్నో ఆరోగ్య ప్రయోజనాలు

కు(ఎ)ండల కాలం

వేసవి వచ్చింది. ఎండలు మండిపోతున్నాయి. కాసిన్ని చల్లనీరు తాగాలని ప్రతిఒక్కరూ కోరుకుంటారు. ఫ్రిజ్‌లోని నీరు తాగుతుంటారు. ఇటీవలిగా చల్లని మట్టి కుండలోని నీరు తాగేవారి సంఖ్య పెరుగుతోంది. కుండలోని నీటితో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలున్నాయని నిపుణులు సూచిస్తున్నారు. దీంతో కుండలోని నీరు తాగేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ నేపథ్యంలో మట్టి కుండలకు డిమాండ్ పెరిగింది. ఎటుచూసినా.. మట్టి కుండలు దర్శనమిస్తున్నాయి.



అమ్మకానికి సిద్ధంగా ఉన్న మట్టి కుండలు

హిందూపురం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు ఏ ఇంట్లో చూసినా మట్టి కుండ ఉండేది. చెలిమ నుంచి నీరు పట్టుకుని రావడం మొదలుకుని నిలువ ఉంచడానికి అన్నింటికీ మట్టి కుండలనే వినియోగించేవారు. ఓ రకంగా చెప్పాలంటే అప్పట్లో ప్రతి ఇంట్లో కుండ నిత్యవసర వస్తువు. పండుగ సమయాల్లో కచ్చితంగా మట్టిపాత్రలు కొత్తవి కొనుగోలు చేసేవారు. అందులోనే వంటలు వండి ఆరగించేవారు. మారిన కాలానుగుణంగా మట్టి కుండలకు ఆదరణ తగ్గుతూ వచ్చింది. ఒకానొక దశలో మట్టి కుండలు కొనేవారు, వాడేవారు లేకుండాపోయారు. కొన్నేళ్లుగా పరిస్థితుల్లో మార్పు వస్తోంది. ప్రతి వ్యక్తి ఆరోగ్యంపై దృష్టి పెడుతున్నారు. మట్టి పాత్రలు ఆరోగ్యానికి ఎంతో మేలు అని నిపుణులు సూచిస్తున్నారు. దీంతో మళ్లీ మట్టి పాత్రల వైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో మట్టి కుండలు దర్శనమిస్తున్నాయి. ఫ్రిడ్జ్ నీటికంటే మట్టికుండలో నీరే ఆరోగ్యానికి మంచిదని నిపుణులు, వైద్యులు చెబుతున్నారు. దీంతో వేసవిలో వీటికి గిరాకీ పెరిగింది.

ఆరోగ్యానికి మేలు

మట్టికుండలోని నీరు తాగితే ఆరోగ్యానికి ఎంతో మేలు చూకూరుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. గొంతునొప్పి, జలుబు, ఇతరత్రా వ్యాధులు నివారించవచ్చని చెబుతున్నారు. మట్టి కుండలో నీరు తాగడం ద్వారా ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలున్నాయి.

చలివేంద్రాల్లో ఇవే..

వేసవి ప్రారంభం కావడంతో పట్టణాల్లో చాలాచోట్ల చలివేంద్రాలు ఏర్పాటు చేస్తుంటారు. పెద్దపెద్ద కుండలు ఉంచి కొన్నిచోట్ల మజ్జిగ, మరికొన్నిచోట్ల నీరు ఉంచి బాటసారులు, ప్రయాణికులకు అందిస్తుంటారు. దీంతో మట్టికుండలకు గిరాకీ పెరిగింది. పెద్దపెద్ద పట్టణాలు, నగరాల్లో సైతం మట్టికుండలు, బిందెలు, కూజాల విక్రయాలు పెరిగాయి. ప్రస్తుతం జనాల అవసరాలకు తగ్గట్టుగా వీటికి ట్యాప్‌లు బిగించి, అమ్ముతున్నారు. 5 లీటర్లు మొదలుకుని 30 లీటర్ల కుండలు అందుబాటులో ఉన్నాయి. మార్కెట్‌లో వీటి ధరలు రూ.100 నుంచి 500దాకా పలుకుతున్నాయి. వేసవి కావడంతో పది శాతం ధరలు పెంచినట్లు తెలుస్తోంది.



వేసవిలోనే అమ్మకాలు



వేసవి కాలంలో, ఎండలు అధికంగా ఉన్న సమయంలోనే మట్టి కుండలు అమ్మకాలు బాగుంటాయి. మిగిలిన రోజుల్లో రెండు మూడు కుండలు కూడా అమ్ముడుపోవు. ఈ మూడు నెలలు వేసవిలో రోజుకు 20 నుంచి 30 కుండలు అమ్ముడవుతాయి.

-పిల్లప్ప, కుండల వ్యాపారి

తప్పనిసరిగా కొంటాం..



ఇరవై ఏళ్ల క్రితం ప్రతి ఇంట్లోనూ మట్టి కుండలు ఉండేవి. ధాన్యం నిల్వకు కూడా వీటిని ఉపయోగించేవాళ్లం. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. కానీ వేసవిలో తప్పనిసరిగా కుండలను వాడుతున్నాం. ఫ్రిజ్ నీళ్లకంటే కుండల్లో నీరే ఆరోగ్యానికి మంచిదని మా పెద్దలు చెప్పేవారు.

- నాగన్న, కగ్గల్లు

ఏళ్లుగా కుండ నీరే..



ప్రతి సంవత్సరం వేసవిలో తప్పనిసరిగా తాగునీటి కోసం కొత్తకుండలు కొనుగోలు చేస్తాం. మారిన కాలానికి అనుగుణంగా కొళాయి ఉన్న కుండలని తీసుకెళ్తున్నాం. ఎర్రటి మట్టి కుండలో నీరు చాలా చల్లగా ఉంటుంది.



- రహంతుల్లా, మేళాపురం



మొండిగోడలకు పరిమితమైన ఇండోర్ స్టేడియం



↑ శిథిలావస్థకు చేరిన పశువుల ఆసుపత్రి భవనం

ఎన్నేళ్లకు పూర్తవుతాయో..?



- ఆగిన ప్రభుత్వ భవన నిర్మాణాలు
- ప్రారంభం కాక మునుపే నెర్రెలు చీలిన గోడలు
- దాదాపు రూ.5కోట్ల ప్రజాధనం వృథా
- పట్టించుకోని అధికారులు

తాడిపత్రి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వివిధరకాల ప్రభుత్వ భవన నిర్మాణాలు అర్ధంతరంగా ఆగిపోయాయి. నిర్మాణాలు పూర్తికాక మునుపే గోడలు నెర్రెలు చీలడం, బండపరుపు దెబ్బతినడం వంటివి జరుగుతున్నాయి.పట్టణంలోని శ్రీనివాసపురంలో పశువుల ఆసుపత్రితో పాటు ల్యాబ్ నిర్మాణానికి దాదాపు రూ.80లక్షలు నిధులు మంజూర య్యాయి. నిధులు మొత్తం ఖర్చు చేసి నిర్మాణం దాదాపు పూర్తిచేశారు. మిగిలిన పనులు పూర్తిచేయడానికి ఇంకా రూ.20 లక్షల మేర నిధులు కావాల్సి ఉండగా గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో నూతన భవనం శిథిలావస్థకు చేరింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో యువతకు క్రీడల్లో నైపుణ్యం పెంచాలన్న ఉద్దేశంతో పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో రూ.2కోట్ల వ్యయంతో చేపట్టిన నిర్మాణ పనులు మొండిగోడలకే పరిమితమయ్యాయి. చిన్నబజారులోని పాతకూరగాయల మార్కెట్ సమీపంలో రూ.26లక్షల వ్యయంతో చేపట్టిన షాదీఖానా భవన నిర్మాణం అర్ధంతరంగా ఆగిపోవడంతో వృథాగా మారి ఆ స్థలంలో పిచ్చిమొక్కలు, కంపచెట్లు ఏపుగా పెరిగాయి. పాతకోటలో రూ.80లక్షలతో నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం నిధుల లేమితో మధ్యలోనే ఆగిపోయింది. నిర్మాణం పూర్తికావాలంటే మరో రూ.40లక్షలు కావాల్సి ఉంటుంది. ఉపకేంద్రం నిర్మాణం పూర్తయితే స్థానికులకు ఆరోగ్య సేవలు అందుబాటులోకి వస్తాయి. వీటిపై పాలకులు దృష్టిపెడితే బాగుంటుందని స్థానికులు చర్చించు కుంటున్నారు.

రూ.5 కోట్ల ప్రజాధనం వృథా

ప్రజలకు సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురావాలన్న తలంపుతో గత టీడీపీ ప్రభుత్వం భవనాల నిర్మాణాల కోసం విడుదల చేసిన రూ.5కోట్లు వృథాగా మారాయి. నిధులు తక్కువగా ఉన్న వాటికి అదనపు నిధులు ఇవ్వడంలో వైసీపీ ప్రభుత్వం విఫలమైంది. దాదాపు ఎనిమిదేళ్లు అవుతుండటంతో భవనాలు శిథిలావస్థకు చేరాయి. దీంతో ప్రజాధనం వృథాగా మారింది. ఇప్పటికైనా అధికారులు తగు చొరవ చూపి భవనాల నిర్మాణాలు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తే బాగుంటుందని ప్రజలు కోరుతున్నారు.

ప్చ్...ఉపయోగం లేదు

మూగజీవాలకు తప్పని నీటి కష్టాలు

పామిడి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వేసవిలో మనుషులకే కాదు మూగజీవాలకు తాగునీటి తిప్పలు తప్పడం లేదు. భూగర్భ జలాలు రోజురోజుకు అడుగంటిపోవడంతో వ్యవసాయ బోర్లతో పాటు గ్రామాల్లోనూ నీటి పథకాల బోర్లు, చేతి పంపుల్లో నీళ్లు అడుగంటిపోయాయి. మండలంలోని చెరువులు, కుంటలు, బావులలో నీరు ఇంకిపోతోంది. ఒకవైపు గ్రాసం కొరత మరోవైపు దాహార్తితో పశువులు అలమటిస్తున్నాయి. దీంతో తమ పశువులను ఎలా బతికించుకోవాలో తెలియడం లేదని పలువురు రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో దాదాపు గేదెలు 9400లు, గొర్రెలు, మేకలు 41000, కోళ్లు 11000 ఉన్నట్లు పామిడి ప్రభుత్వ పశువైద్యాధికారిణి ఉషాకిరణ్ పేర్కొన్నారు. ఈ మూగజీవాలకు వేసవిలో నీరందించలేక రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

నిరుపయోగంగా నీటి తొట్టెలు
పట్టించుకోని అధికారులు
ఆందోళనలో పాడి రైతులు



దేవరపల్లిలో కంపచెట్లలో నిరుపయోగంగా ఉన్న పశువుల నీటితొట్టె

నీటి తొట్లు వృథా

మండలంలోని దేవరపల్లి, సొరకాయలపేట, అనుంపల్లి, దిబ్బసానిపల్లి, ఖాదర్‌పేట, రామగిరి, ఎదురూరు తదితర గ్రామాలలో రూ.వేలాది ప్రజాధనం వెచ్చించి పశువుల దాహార్తి తీర్చేందుకు నీటి తొట్టెలను నిర్మించారు. నిర్వహణ కరువవడంతో నీటి తొట్టెలు నిరుపయోగంగా మారాయి. కొన్ని గ్రామాల్లో రెండు నీటి తొట్టెలను నిర్మించారు. తొట్టెలను నిర్మించి నిధులు కాజేశారే తప్ప పశువుల దాహార్తిని తీర్చలేకపోయారని పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు గ్రామాల్లో నీటి తొట్టెలు ధ్వంసమయ్యాయి. దిబ్బసానిపల్లి, కట్టకిందపల్లి గ్రామాల్లో నీటి తొట్టెలలో నీరు ఉండటంతో మూగజీవులకు దాహార్తి తీరుతోంది. నిర్మించిన నీటి తొట్టెలకు బోరుబావులు, ట్యాంకర్ల ద్వారా నీటిని నింపి పశువుల దాహార్తిని తీర్చాల్సిన అవసరం ఉంది. అధికారులు స్పందించి నీటి తొట్టెలను నీటితో నింపాలని రైతులు కోరుతున్నారు.

కలచివేస్తోంది: సుదర్శన్‌బాబు, పాడిరైతు, రామగిరి



వేసవిలో మూగజీవాల రోదన పాడి రైతులను ఎంతగానో కలచివేస్తోంది. గ్రామంలో నీటి తొట్టెను నిర్మించి చేతులు దులుపుకున్నారు. తొట్టెను నీటితో నింపిన పాపానపోలేదు. ఎన్నో పశువులు వేసవిలో దాహం తీర్చుకోవడానికి నానా ఇబ్బందులు పడుతున్నాయి. మూగజీవాలను చూస్తే కడుపు తరుక్కుపోతోంది. అధికారులు చొరవ తీసుకొని నీటితొట్టెలను వినియోగంలోకి తేవాలి.

నీటి తొట్టె నిర్మించాలి




రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తూ పాడి రైతులకు ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతోంది. పాడి రైతులకు అధికారులు ఏ పథకాలుపైన ఎలాంటి సమాచారమూ ఇవ్వరు. ఈ వేసవిలో పశువులు దాహార్తి తీర్చడానికి తీవ్రంగా శ్రమిస్తున్నాం. పశువుల కోసం నీటితొట్టెలను నిర్మిస్తే చాలా బాగుంటుంది. పశువులు, పాడిరైతులను పట్టించుకునే వారేలేరు.

-రాఘువేంద్ర, పాడిరైతు, నీలూరు

పీఏబీఆర్‌లో అడుగంటిన నీరు





చెర్లోపల్లి రిజర్వాయర్

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండుతున్న వేసవికి ఉమ్మడి జిల్లాలోని జలాశయాలు అడుగంటిపోతున్నాయి. ఆయా రిజర్వాయర్లలో ఇప్పటికే నీటి నిల్వలు కనిష్ఠస్థాయికి చేరాయి. జలవనరుల శాఖ ఇంజనీర్లు మాత్రం నీటి నిల్వలు తాగునీటి అవస రాలకు అనుగుణంగా ఉన్నాయని చెబుతున్నా రిజర్వాయర్లలో ఆ స్థాయిలో నీటి నిల్వలు లేవని తెలుస్తోంది. రెండు జిల్లాల కలెక్టర్లు, యంత్రాంగంతో సమన్వయం చేసుకుని నీటి నిల్వ, వేసవిలో తాగునీటి అవసరాలను బేరీజు చేసుకుని సమస్య తలెత్తకుండా చూడాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. ఉమ్మడి జిల్లాకు ప్రధానం గా శ్రీశైలం డ్యాం నుంచి హంద్రీనీవా ద్వారా, టీబీ డ్యాం నుంచి హెచ్చెల్సీ ద్వారా జిల్లాకు సాగు, తాగునీరు అందుతున్నాయి. ఇప్పటికే శ్రీశైలం, టీబీ డ్యాం నుంచి నీటి సరఫరాను నిలిపివేశారు. ఈ నేపథ్యం లో ఉమ్మడి జిల్లాలోని రిజర్వాయర్లలో నిల్వ ఉన్న నీటిని కాపాడుకుం టూ...పొదుపుగా నీటిని వినియోగించుకోవడంపైనే దృష్టి సారించాలని నిపుణులు సూచిస్తున్నారు.

- అడుగంటుతున్న జలాశయాలు
- వేసవి నీటి ఎద్దడిపై ఆందోళన
- ఎండ తీవ్రతతో ఆవిరవుతున్న జలాలు
- పొంచి ఉన్న నీటి గండం


వేగంగా..!

జీడిపల్లి రిజర్వాయర్‌లో పడిపోయిన నీటి నిల్వ



ఉమ్మడి జిల్లాలో జలాశయాల్లో నీటి నిల్వల పరిస్థితి

జిల్లాలోని రిజర్వాయర్లు.. వాటి సామర్థ్యం.. ప్రస్తుత నీటి నిల్వలను పరిశీలిస్తే.. హంద్రీనీవా కింద జీడిపల్లి 1.68టీఎంసీల సామర్థ్యం కాగా ప్రస్తుతం 1.490టీఎంసీల నీటి నిల్వ ఉంది. గొల్లపల్లి 1.913టీఎంసీలు కెపాసిటీ కాగా ప్రస్తుతం 1.180టీఎంసీలు, మారాల 0.483టీఎంసీలు సామర్థ్యం ఉండగా ప్రస్తుతం 0.250టీఎంసీలు, చెర్లోపల్లి 1.608 టీఎంసీలు సామర్థ్యం కాగా ప్రస్తుతం 1.410టీఎంసీల నీరు నిల్వ ఉంది. పేరూరు డ్యాం 1.810టీఎంసీల సామర్థ్యం కాగా ప్రస్తుతం 0.450టీఎంసీలు, భైరవానితిప్ప ప్రాజెక్ట్ 2.1టీఎంసీల సామర్థ్యం కాగా ప్రస్తుతం 0.510టీఎంసీల నీరు ఉంది. హెచ్చెల్సీ కింద చాగల్లు రిజ ర్వాయర్ 1.5టీఎంసీలుగా కాగా ప్రస్తుతం 0.660టీఎంసీలు, పెండేకల్లు 0.655టీఎంసీలుగా కాగా ప్రస్తుత 0.198టీఎంసీలు, పెనకచెర్ల డ్యాం (ఎంపీఆర్) 5.200టీఎంసీల సామర్థ్యం కాగా ప్రస్తుతం 0.795టీఎంసీలు, పీఏబీఆర్ డ్యాం 11.10టీఎంసీల సామర్థ్యం కాగా ప్రస్తుతం 2.174టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది.



గొల్లపల్లి రిజర్వాయర్

ఎండల తీవ్రత సాధారణం కంటే అధికం

ఈ ఏడాది సాధారణం కంటే ఎండల తీవ్రత అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ ఇప్పటికే హెచ్చరించింది. గత ఏడాదితో పో లిస్తే ప్రస్తుతం జలవనరుల పరిస్థితి బా గానే ఉందని అధికారులు చెబుతున్నారు. అయితే ప్రస్తుతం వేసవి తీవ్రత పెరగడంతో జలాశయాల్లో నీరు వేగంగా అడుగంటి పోతుండటం ఆందోళన కలిగించే అంశం. ఈ నేపథ్యంలో తాగునీటి అవసరాలకు ప్రాధాన్యం కల్పిస్తూ స్థానిక అధికారులతో సమన్వయం చేసుకుంటూ తాగునీటి సరఫరా చేయడంపైనే దృష్టి పెట్టారు. ఇప్పటికే పలుమార్లు నీటి నిల్వలు, తాగునీటి అవసరాలపై రెండు జిల్లాల కలెక్టర్లతో జలవనరుల శాఖ ఇంజనీర్లు సమీక్షించి అంచనాలపై చర్చించారు. ఉమ్మ డి జిల్లాల కలెక్టర్లు, జిల్లాల యంత్రాంగంతో జలవనరుల శాఖ అధికారులు, ఇంజనీర్లు సమన్వయం చేసుకుంటూ రిజర్వాయర్లలో నీటి నిల్వపై అంచనా వేస్తున్నారు.

తాగునీటికి ఇబ్బంది లేదు: నాగరాజ, జలవనరుల శాఖ ప్రాజెక్టుల సీఈ



వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి అవసరాలకు అనుగుణంగా రిజర్వాయర్లలో నీటి నిల్వలు ఉంచాం. వేసవి తీవ్రత అధికంగా ఉండటంతో జలాశయాల్లో నీరు వేగంగా ఆవిరి అవుతూ, భూమిలోకి ఇంకిపోతోంది. ఇది కొంత మేర ఆందోళన కలిగించినా... జూన్, జూలై నెల వరకు తాగునీటికి ఎక్కడా ఇబ్బంది రాకుండా అందించేందుకు రిజర్వాయర్లలో నీటి లభ్యత ఉంది. ఇప్పటికే రెండు జిల్లాల కలెక్టర్లు, యంత్రాంగానికి తాగునీటి అవసరాలకు అనుగుణంగా ఆయా రిజర్వాయర్లలో ఉన్న నీటి నిల్వలు, ప్రణాళికలపై చర్చించాం. ఎక్కువగా అనంతపురం, హిందూపురానికి నీటిని ఇవ్వాలని సూచించారు. అందుకు అనుగుణంగా మా ఇంజనీర్లకు నీటి సరఫరాపై పలు సూచనలు ప్రభుత్వం ఇచ్చింది. ప్రణాళిక ప్రకారమే తాగునీటిని సరఫరా చేస్తాం.

తిరుపతి ప్యాసింజరు పాక్షిక పునరుద్ధరణ

గుంతకల్లు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): కుంభమేళా నేపథ్యంలో రద్దయిన తిరుపతి-కదిరిదేవరపల్లి ప్యాసింజరు రైలును రైల్వే అధికారులు పాక్షికంగా పునరుద్ధరించారు. 1వ తేదీ సాయంత్రం కదిరిదేవరపల్లి-తిరుపతి ప్యాసింజరు (నం. 57406) రైలును గుంతకల్లు నుంచి ప్రారంభించారు. ఈ రైలును డిసెంబరు 28వ తేదీ నుంచి రద్దుపరచి ప్రయాగరాజ్ కుంభమేళాకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం పంపారు. ఈ రైలు గతనెల 1వ తేదీనే పునఃప్రారంభం కావాల్సి ఉండగా, కుంభమేళా నుంచి భక్తులను స్వస్థలాలకు తరలింపు కార్యక్రమం కోసం ఆ తేదీని మార్చి నెలాఖరుకు వాయిదా వేశారు. మార్చి 27వ తేదీకి తిరుపతి ప్యాసింజరు రైళ్లు డివిజన్ కేంద్రానికి చేరగా, యార్డులో నిలిపి ఉంచారు. ఈ రైళ్లను ఎప్పుడు ప్రారంభించనున్నారో రైల్వే అధికారులు ముందుగా ప్రకటించకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చెప్పాపెట్టకుండా ప్యాసింజరు రైలును కదిరిదేవరపల్లి నుంచి కాకుండా గుంతకల్లు నుంచి తిరుపతికి పాక్షికంగా పునరుద్ధరించారు. మెయింటెనెన్స్ పనుల కారణంగా కదిరిదేవరపల్లి-గుంతకల్లు సెక్షన్‌లో రైలును పాక్షికంగా రద్దుపరచి గుంతకల్లు-తిరుపతి సెక్షన్‌లో తిరిగేలా రెన్యూవల్ చేశారు. అలాగే తిరుపతి-గుంతకల్లు-తిరుపతి ప్యాసింజరు (నం. 57403/04) రైలును కూడా పునరుద్ధరించారు. కిందటి వారమే తిరుపతి-హుబ్లీ-తిరుపతి ప్యాసింజరు (నం. 57401/02) రైలును పునరుద్ధరించారు.

నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

స్వామి నారాయణ్ (జయంతి)



సహజానందస్వామిగా పేరొందిన స్వామినారాయణ్ 1781 ఏప్రిల్ 3న ఉత్తరప్రదేశ్ రాష్ట్రం అయోధ్య మీపంలో జన్మించారు. యోగి, సన్యాసిగా రాణించిన ఆయన ధర్మం, అహింస, బ్రహ్మచర్యంపై బోధనలు చేశారు. 11ఏళ్ల వయసులో తీర్థయాత్ర చేపట్టి గురువు రామానంద్ ద్వారా ఉద్ధవ్ సంప్రదాయంలో దీక్ష స్వీకరించారు. తన తత్వాన్ని అమలు చేసేందుకు 500మంది పరమహంసలను నియమించాడు. సామాజిక సూత్రాలకు సంబంధించి శిక్షాపత్రిని రచించారు. 1830 జూన్ 1న కన్నుమూశారు.

శ్యామ్ మానెక్ షా (జయంతి)



'పద్మవిభూషణ్' గ్రహీత శ్యామ్ హోర్ముస్‌జీ ఫ్రాంజీ జంషెడ్‌జీ మానెక్ షా 1914 ఏప్రిల్ 3న పంజాబ్ రాష్ట్రం అమృత్‌సర్‌లో జన్మించారు. ఆర్మీలో నాలుగు దశాబ్దాలపాటు వివిధ హోదా లలో కొనసాగి 'చీఫ్ ఆఫ్ ది ఆర్మీస్టాఫ్'గా వ్యవ హరించారు. రెండో ప్రపంచయుద్ధంలో జపాన్ ఆక్రమిత దళాలను తిప్పికొట్టడంలో కీలకంగా వ్యవహరించారు. 1971లో ఇండో-పాక్ యుద్ధంలో ప్రదర్శించిన వ్యూహ చతురత, బుద్ధికుశలత అమోఘమైనవి. దేశ అత్యున్నతమైన తొలి 'ఫీల్డ్‌మార్షల్'గా పదోన్నతి సాధించారు. 94వ యేట 2008 జూన్ 27న కన్నుమూశారు.

డోరిస్ డే (జయంతి)




అమెరికాకు చెందిన నటి, గాయని డోరిస్ డే 1922 ఏప్రిల్ 3న జన్మించారు. జంతు ప్రేమికురాలిగా కూడా గుర్తింపు పొందారు. ఆమె నటించిన కాలాన్ని గోల్డెన్ ఏజ్ ఆఫ్ హాలీవుడ్‌గా పరిగణిస్తారు. 1948లో 'రొమాన్స్ ఆన్ ది హై సీస్' అనే సినిమాతో తెరంగేట్రం చేశారు. సంగీత, కామెడీ, డ్రామా, థ్రిల్లర్ తదితర అన్ని రకాల సినిమాలలో నటించారు. గోల్డెన్ గ్లోబ్ సిసిల్ బి. డిమల్లె అవార్డు, ప్రెసిడెన్షియల్ మెడల్ ఆఫ్ ఫ్రీడం తదితర పురస్కారాలు అందుకున్నారు. 2019 మే 13న కన్నుమూశారు.

మార్లన్ బ్రాండో (జయంతి)



అమెరికాకు చెందిన నటుడు, దర్శకుడు మార్లన్ బ్రాండో 1924 ఏప్రిల్ 3న జన్మించారు. 60ఏళ్ల సినీ కెరీర్‌లో 20వ శతాబ్దంలో ఎంతో ప్రభావితుడిగా నిలిచారు. అకాడమీ అవార్డు ఫర్ బెస్ట్ యాక్టర్‌ను రెండుసార్లు అందుకున్నారు. మానవ హక్కుల కోసం కూడా పాటుపడ్డారు. అమెరికన్ ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌చే నాల్గో గ్రేటెస్ట్ మూవీ స్టార్‌గా నిలిచారు. టైమ్ జాబితాలో యాక్టర్ ఆఫ్ ది సెంచరీగా నిలిచారు. 2004 జూలై 1న కన్నుమూశారు.

ఆది గోద్రెజ్ (పుట్టినరోజు)



ఆది బుర్జోర్జి గోద్రెజ్ 1942 ఏప్రిల్ 3న ముంబైలో జన్మించారు. దేశంలో పేరొందిన వ్యాపారదిగ్గజం, పారిశ్రామికవేత్త. గోద్రెజ్ గ్రూప్ చైర్మన్, గోద్రెజ్ కుటుంబానికి పెద్దదిక్కు. ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌కు చైర్మన్‌గా, కన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీకి అధ్యక్షుడిగా వ్యవహరించారు. నిత్యావసర వస్తువుల మార్కెటింగ్‌లో దేశంలో సత్తా చాటారు. సామాజిక బాధ్యతలో భాగంగా విద్య, వైద్య పర్యావరణ రంగాలలో చేయూతనిస్తున్నారు.

హరిహరన్ (పుట్టినరోజు)



'పద్మశ్రీ' గ్రహీత హరిహరన్ 1955 ఏప్రిల్ 3న త్రివేండ్రమ్‌లో జన్మించారు. నేపథ్య గాయ కుడిగా రాణించారు. పలు భాషలలో పాటలు పాడారు. ప్రత్యేకించి భజనలు, గజల్స్‌తోపాటు తమిళ, హిందీ భాషలలో పలు ప్రైవేట్ ఆల్బమ్స్ విడుదల చేశారు. సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ నేతృత్వంలో పలు పాటలు పాడారు. రెండు జాతీయ, పలు రాష్ట్రస్థాయి పురస్కారాలు అందుకున్నారు. బుల్లితెరపై సంగీత కార్యక్రమాలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. 2021లో గుల్షన్‌కుమార్, హరిహరన్‌ల హనుమాన్ చాలీసాను టి సిరీస్ విడుదల చేయగా యూట్యూబ్‌లో 2 బిలియన్‌ల మంది చూడడం ఒక రికార్డుగా నిలిచింది.

జయప్రద (పుట్టినరోజు)



జయప్రద 1962 ఏప్రిల్ 3న తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రిలో జన్మించారు. అసలు పేరు లలితా రాణి. తెలుగు, తమిళ, మళయాళ, కన్నడ, హిందీ భాషలలో 1970-90ల మధ్య పలు సినిమాలలో నటించారు. నంది అవార్డు, మూడు ఫిల్మ్‌ఫేర్ పురస్కారాలతోపాటు పలు అవార్డులు అందుకున్నారు. లోక్‌సభ సభ్యురాలిగా వ్యవహరించారు. సినిమాలకు గుడ్‌బై చెప్పి రాజకీయాల్లో, బుల్లితెరపై రాణిస్తున్నారు.

ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి

ధర్మవరం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ప్రజలు ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకొనిరావాలని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ స్పష్టం చేశారు. బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ప్రజాదర్బార్ - కార్యకర్తలు, ప్రజల సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని హిందూపురం పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు అంజనప్పతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ కాలనీలకు చెందిన ప్రజలు కార్యకర్తలు తమప్రాంతాల్లో ఉన్న సమస్యలను పరిటాల శ్రీరామ్ దృష్టికి తెచ్చారు. వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

● సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

నియోజకవర్గంలో వివిధ కారణాలతో ప్రైవేటు ఆస్పత్రిల్లో చికిత్సలు పొంది ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న 12 మందికి రూ.7.68 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరయ్యాయి. వాటిని పరిటాల శ్రీరామ్ బాధితులకు అందజేశారు. ముదిగుబ్బ మండలంలో ముగ్గురికి, ధర్మవరం పట్టణంలో ఐదుగురు, రూరల్‌లో నలుగురికి ఆ చెక్కులు అందజేశారు.

ఘనంగా రేణుకా యల్లమ్మదేవి కరగ ఉత్సవం

శిడ్లఘట్ట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): శిడ్లఘట్ట పట్టణంలోని రేణుకా యల్లమ్మదేవి పూల కరగ ఉత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. టీబీ రోడ్డు కేకేపేటలో నెలవైన రేణుకా యల్లమ్మదేవి ఉత్సవాలలో కరగను తలపై ధరించి పురవీధులలో సాగింది. వీరులు, భక్తులు కరగ వెంబడి సాగారు. ఇళ్ల ముందు రంగవల్లులు వేసి కరగను స్వాగతించారు. పట్టణంలో రెండు చోట్ల వాద్యగోష్ఠి ఏర్పాటు చేశారు. డప్పు వాద్యాలు, సినీగీతాలు, సంగీతానికి అనుగుణంగా భక్తులు సందడి చేశారు. పట్టణ ప్రదక్షిణ అనంతరం కరగ గర్భగుడి చేరింది. విశేషపూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కరగ మహోత్సవంలో ప్రముఖ కళాబృందాలు పాల్గొని కన్నడ, తెలుగు, హిందీ గీతాలను ఆలపించారు. నగరసభ ఉపాధ్యక్షుడు రూపనవీన్ ఆధ్వర్యంలో భక్తులకు భోజన వ్యవస్థ కల్పించారు. ఉత్సవంలో మాజీ మంత్రి వీ మునియప్ప, మాజీ ఎమ్మెల్యే ఎం రాజణ్ణ, మేలూరు సచిన్, కాంగ్రెస్ నాయకులు రాజీవ్‌గౌడ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు సహనా రాజీవ్‌గౌడ, బీజేపీ రూరల్ హోబళి అధ్యక్షుడు సీకల్ ఆనందగౌడ, ప్రముఖులు బీరప్పనహళ్ళి నరసింహమూర్తి, నగరసభ అధ్యక్షురాలు వెంకటస్వామి, నగరసభ ఉపాధ్యక్షులు రూప నవీన్‌కుమార్, నగరసభ సభ్యులు లక్ష్మణ్, స్కూల్ దేవరాజ్, పీఎల్‌డీ బ్యాంకు అధ్యక్షుడు బంకు మునియప్ప స్థానిక ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.



పురవీధులలో కరగ ఊరేగింపు

ఫుట్‌పాత్ ఆక్రమణలపై చర్యలేవీ..?



ఫుట్‌పాత్‌పై కూరగాయల దుకాణాలు

బాగేపల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): తాలూకాకేంద్రమైన బాగేపల్లిలో రోజు రోజుకు ప్రజలరద్దీ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో పట్టణంలోని ప్రధాన రోడ్లకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లపైనే పలు తోపుడుబండ్లు, చిన్నా చితకా దుకాణాలు వెలిశాయి. దీంతో ప్రజల సంచారానికి ఆటంకం ఏర్పడుతోంది. ఫుట్‌పాత్‌లపై టీ షాప్, పాన్‌షాప్, టిఫిన్ సెంటర్‌లు ఉన్నాయి. ఫుట్ పాత్‌పైనే కొనసాగుతున్నా వీటిని ప్రశ్నించేవారు సైతం లేకపోవడంతో యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. పూలు, కూరగాయలు, అరటిపండ్లు ఇత రత్రా దుకాణాలు వరుసగా ఉన్నాయి. వ్యర్థాలను సైతం రోడ్డుపైనే పడేస్తుండడంతో స్వచ్ఛత కొరవడింది. ఒకవేళ పురసభ అధికారులు, సిబ్బంది తొలగింపు చర్యలు చేపట్టినా రాజకీయ నాయకులు, పలుకుబడిన కల్గిన వ్యక్తులు ఫోన్ చేస్తే తిరిగి యథా ప్రకారం వాటిని కొనసాగించేందుకు అవకాశం కల్పిస్తున్నట్టు తెలుస్తోంది. ఫుట్‌పాత్‌లను ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేయడంతో ప్రజలు రోడ్లపైనే సంచరించాల్సిన పరిస్థితి. బస్టాండ్, పురసభ ముందుభాగం, మినీ విధానసౌధ ముందుభాగం, ప్రభుతత్వ ఆసుపత్రి ముందుభాగం, ఆంజనేయస్వామి ఆలయం సమీపాన, పాత మిడిల్‌స్కూల్ ప్రాంతాల్లో ఇష్టం వచ్చినట్టు వాహనాలు పార్కింగ్ చేయడం కూడా ఒక సమస్యగా మారింది. స్వచ్ఛతను పాటించని దుకాణదారులపై చర్యలు తీసుకోవాలని వ్యాహ్యాళికి వెళ్లే ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

చంద్రమౌళీశ్వరస్వామి రథోత్సవం

బంగారపేట, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని తొప్పనహళ్ళిలో నెలవైన చంద్రమౌళీశ్వరస్వామి బ్రహ్మరథోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. దేవదాయశాఖ పరిధిలోని పురాతన ఆలయానికి ఏటా జాతర నిర్వహిస్తారు. ఉగాది నేపథ్యంలో 8రోజులపాటు జాతర కొనసాగుతుంది. మార్చి 31న ప్రారంభమైన ఉత్సవాలలో బుధవారం రథోత్సవం సందడిగా సాగింది. తహసీల్దార్ వెంకటేశప్ప రథోత్సవాన్ని లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాతరల ద్వారా ప్రజలలో సామరస్యం పెరుగుతుందన్నారు. రాత్రి పౌరాణిక నాటకం రామాంజనేయ యుద్ధం నాటిక భక్తులను ఆకట్టుకుంది. కాగా గురువారం సత్యహరిశ్చంద్ర, శుక్రవారం దానవీరశూరకర్ణ నాటకాలు జరగనున్నాయి. శుక్రవారం పుష్పపల్లకి, శనివారం ముత్యాల పల్లకి ఉత్సవం, సోమవారం స్వామివారి విశ్వరూప దర్శనంతో ఉత్సవాలు ముగియనున్నాయని ఆలయ ధర్మకర్త రామచంద్రరెడ్డి తెలిపారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

వ్యవసాయ సంఘం అధ్యక్షుడిగా బాబురెడ్డి

దొమ్మసంద్ర, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఆనేకల్ తాలూకా వ్యవసాయ ఉత్పత్తుల విక్రయ సహకారసంఘం నూతన అధ్యక్షుడిగా ఎం బాబురెడ్డి, ఉపాధ్యక్షుడిగా మునిచౌడప్ప ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘం అధ్యక్షుడిగా కొనసాగిన వెంకటస్వామి రాజీనామాతో ఖాళీ అయిన స్థానానికి బుధవారం ఎన్నికలు జరిగాయి. అధ్యక్ష స్థానానికి బాబురెడ్డి, ఉపాధ్యక్ష స్థానానికి మునిచౌడప్పలు మాత్రమే నామినేషన్ వేయడంతో ఏకగ్రీవమైనట్టు ప్రకటించారు. హెన్నాగర గ్రామ పంచాయతీ మాజీ అధ్యక్షుడిగా, హాప్‌కామ్స్ మాజీ డైరెక్టర్‌గా, జాతీయ ఉద్యానవన మండలి డైరెక్టర్‌గా సేవలందించిన బాబురెడ్డి ప్రస్తుతం టీఏపీసీఎంఎస్ అధ్యక్షుడు కావడంతో అభిమానులు హర్షం వ్యక్తం చేశారు. పలువురు ప్రత్యేకంగా సత్కరించి అభినం దించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొడ్డహగడె హరీశ్‌గౌడ, శ్రీధర్, ముఖ్యులు ఆర్‌కే రమేశ్, ఎన్‌బీఐ నాగరాజు, నటరాజ్ తదితరులు అభినందించారు.



అధ్యక్ష, ఉపాధ్యక్షులకు సన్మానం

ఘనంగా మారియమ్మ జాతర



అమ్మవారికి విశేష అలంకరణ

ముళబాగిలు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని విరూ పాక్షి గ్రామంలో పురాణ ప్రసిద్ధమైన త్రిపురసుందరి మారియమ్మ అమ్మవారి ఉట్లుజాతర సందర్భంగా విశేషపూజా కార్యక్రమాలు వైభవంగా సాగాయి. మూలవిరాట్టుకు పంచామృతాభిషేకం అనంతరం గణపతి హోమం, నవగ్రహ హోమం, దుర్గా హోమం నిర్వహిం చారు. విరూపాక్షి, అసలి అత్తికుంటె, దొడ్డమాదేనహళ్ళి, వరదాపుర, విజలాపుర, గంగాపుర, కుమదేనహళ్ళి, శెట్టిబనకన హళ్ళి, వరదగానహళ్లి, గుట్టూరు, జమ్మనహళ్ళి తదితర గ్రామా లకు చెందిన మహిళలు తలపై దీపంతో వచ్చి మొక్కులు చెల్లిం చుకున్నారు. కొంతమంది భక్తులు ఎడ్లబండ్లపై వచ్చి విశేష పూజల్లో పాల్గొన్నారు. అర్చకుడు కుమారస్వామి నేతృత్వంలో పూజా కైంకర్యాలు కొనసాగాయి. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ఐపీఎల్‌లో విజయ్‌ప్రకాశ్ పాటల సందడి



బెంగళూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): నగరంలోని చిన్నస్వామి స్టేడియంలో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, గుజరాత్ టైటాన్స్ జట్ల మధ్య బుధవారం రాత్రి క్రికెట్‌మ్యాచ్ ఉత్కంఠగా సాగింది. తొలుత ప్రముఖ సింగర్ విజయప్రకాశ్ కొద్దిసేపు పాటలు పాడి ప్రేక్షకులను రంజింపచేశారు. మ్యాచ్ ఆద్యంతం చీర్ గర్ల్స్ సందడి చేశారు. స్టేడియం వద్ద సాయంత్రం నుంచే రద్దీ మొదలైంది. పలువురు అభిమానులు ఆర్‌సీబీకి మద్దతుగా ట్యాటూలు వేయించుకున్నారు. రాగా మ్యాచ్ నేపథ్యంలో నమ్మ మెట్రో సేవ లను మరికొద్ది సమయం విస్తరించారు. చిన్నస్వామి స్టేడియం వద్ద ఎటు చూసినా అభిమానులు సందడి చేశారు. కాగా పెద్ద సంఖ్యలో ఆర్‌సీబీకి మద్దతుగా ఉంటూ ప్లకార్డులు ప్రదర్శించి నినాదాలు చేశారు. విజయప్రకాశ్ సంగీత కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



స్టేడియం బయట సందడి



స్టేడియంలో పాటలు పాడుతున్న విజయప్రకాశ్

ప్రైవేట్ బస్సు సహా పలు వాహనాలు దగ్ధం

చింతామణి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): చింతామణి పట్టణంలోని బెంగళూరు సర్కిల్‌లోగల ప్రైవేట్‌బస్టాండ్‌లో ఆపియున్న బస్సుకు అకస్మికంగా మంటలు రావడంతో కాలిబూడిదైంది. బుధవారం తెల్లవారుజామున బస్టాండ్ వెనుకభాగాన టెలిఫోన్‌శాఖకు చెందిన స్థలంలో పట్టణ, గ్రామీణ పోలీసులు పలు కేసులలో సీజ్ చేసిన వాహనాలను ఇక్కడే ఉంచుతారు. కాగా ప్రమాదంలో పదికిపైగా ద్విచక్రవాహనాలు కాలిపోయాయి. అయితే సమీపంలోని పెట్రోలబంక్‌కు మంటలు చేరకుండా అగ్నిమాపకసిబ్బంది, పోలీసులు సఫలీకృతులయ్యారు. రాత్రి బందోబస్తులో ఉన్న 112 వాహన ఏఎస్సై వెంకటరెడ్డి, సిబ్బంది, టౌన్ ఏఎస్సై మళ్ళారప్ప, అగ్నిమాపకశాఖ అధికారి లోకేశ్ తదితరులు కార్యాచరణలో పాల్గొన్నారు. చిక్కబళ్లాపుర జిల్లా ఎస్పీ కుశల్‌చౌక్సి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బస్సు యజమాని శ్రీనివాసనాయుడు ఫిర్యాదు మేరకు టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

బైక్ ట్యాక్సీ సేవలు 6 వారాలలో నిలిపివేత..!

▸▸ హైకోర్టు సూచన

బెంగళూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని బెంగళూరు, సాంస్కృతిక రాజధాని మైసూరులలో కొనసాగుతున్న బైక్‌ట్యాక్సీ సేవలు 6 వారాలలో ఆగిపోనున్నాయి. ఇందుకు సంబంధించి హైకోర్టు బుధవారం కీలక సూచనలు చేసింది. బైక్ ట్యాక్సీలు రవాణాశాఖ నమోదుకు సంబంధించి కర్ణాటక ప్రభుత్వం తగిన మార్గదర్శకాలు చేయాలని హైకోర్టు ఆదేశించింది. బెంగళూరు నగరంలో ర్యాపిడో, ఓలా, ఉబెర్ సహా ఇతర బైక్ కంపెనీలు సేవలు కొన్నేళ్లుగా ఉన్నాయి. ఈ బైక్ సేవలను రవాణా శాఖ నమోదుకు సంబంధించి 2022లో సమర్పించిన అర్జీలను పరిగణించి కర్ణాటక ప్రభుత్వానికి సూచనలు చేయాలని ఉబెర్ ఇండియా సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఇతర సంస్థలు హైకోర్టును ఆశ్రయించాయి. ఈ కేసు విచారించిన హైకోర్టు సదరు అర్జీని తిరస్కరించింది. అంతేకాక బైక్ ట్యాక్సీ సేవలను 6 వారాలలోగా బంద్ చేయాలని సూచించింది. 1988 మోటార్ వాహనాల సెక్షన్ 93 ప్రకారం మోటారు సైకిళ్లను రవాణా వాహనాలుగా నమోదు చేసేందుకు అవకాశం లేదు. అయితే దీన్ని ఉల్లంఘించి పలు బైక్ ట్యాక్సీలు కొనసాగుతున్నాయనే అభ్యంతరాల నేపథ్యంలో బైక్‌ట్యాక్సీల నమోదుకు సంబంధించి మార్గదర్శకాలు చేయాలని హైకోర్టు స్పష్టం చేసింది. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా నమోదు చేసుకున్న తర్వాత బైక్ సేవలు కొనసాగించే అవకాశం ఉంది.

ముడా వ్యవహారంలో లోకాయుక్త నివేదికను తిరస్కరించండి

▸▸ ప్రజాప్రతినిధుల కోర్టుకు ఈడీ అర్జీ

బెంగళూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మైసూరు నగరాభివృద్ధి ప్రాధికార (ముడా) 14 ఇంటిస్థలాలను ముఖ్యమంత్రి సిద్దరామయ్య భార్య పార్వతికి కేటాయించిన కేసులో లోకాయుక్త నివేదికను తిరస్కరించాలని కోరుతూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ డిస్యూట్ అప్పీల్ సమర్పించింది. కేసుకు సంబంధించి ప్రజా ప్రతినిధుల కోర్టుకు ఈడీ బుధవారం 8 పేజీల అర్జీని సమర్పించారు. పార్వతికి ఇంటి స్థలాలు కేటాయించడంలో అక్రమాలు జరిగినట్టు ఎన్నో సాక్ష్యాలు లభించాయని ఇందుకు సంబంధించి మరింత సమగ్ర దర్యాప్తు జరగాలని కోరారు. ఈ నేపథ్యంలో లోకాయుక్త నివేదికను తిరస్కరించాలని ఈడీ కోరింది.

గుండెపోటుతో డ్రైవర్... బస్సు ఢీ కొని మహిళ మృతి



ఘటనాస్థలంలో గుమిగూడిన స్థానికులు

బెంగళూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): హెచ్‌డీ కోటి తాలూకా దమ్మనకట్టె వద్ద వెళ్తున్న కేఎస్ఆర్టీసీ బస్సు డ్రైవర్‌కు అకస్మాత్తుగా గుండెపోటు వచ్చింది. స్పృహ కోల్పోయిన అతను స్టీరింగ్‌పై వాలిపోయాడు. వాహనం అదుపు తప్పి విద్యుత్‌స్తంభాన్ని ఢీ కొని పక్కనే ఉన్న పొలంలోకి వెళ్లి ఆగింది. ఇదే సందర్భంగా ఒక పాదచారి మహిళను ఢీ కొంది. బుధవారం చోటు చేసుకున్న ఘటనలో మైసూరుకు చెందిన డ్రైవర్ సునిల్‌కుమార్, హెచ్‌డీ కోటె తాలూకా దమ్మనకట్టె గ్రామానికి చెందిన లక్ష్మమ్మ అక్కడికక్కడే మృతి చెందారు. కాగా బస్సులోని ప్రయాణీకులు అదృష్టవశాత్తు ప్రాణాలతో బయటపడ్డారు. గమనించిన స్థానికులు పెద్దసంఖ్యలో చేరి సహాయక చర్యలు అందించారు. సమాచారం అందుకున్న హెచ్‌డీ కోటె పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు. స్థానికంగా ఈ ఘటన కలచివేసింది. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బోరుబావి పక్కనే గుంత..




రోడ్డుపక్కనే.. ప్రమాదకరంగా..

శిడ్లఘట్ట, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని మళమాచనహళ్ళి గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ముందుభాగాన రోడ్డుపక్కన గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో బోరుబావి తవ్వారు. దెబ్బతిన్న పైపులను ఇటీవల బాగు చేశారు. అయితే ఈ సందర్భంగా తవ్విన గుంతను అలాగే వదిలేయడంతో సమస్యగా మారింది. పాఠశాలకు వచ్చే విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పైగా ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా వాహనచోదకులు ఈ గుంతలో పడిపోవడం ఖాయం. నిత్యం రాకపోకలు సాగించే మార్గంలో ఇంత పెద్దగుంతను ఇలా వదిలేయడం సముచితం కాదని గ్రామస్థులు, వాహనచోదకులు అంటున్నారు.

ఎస్ఈటీ ప్రవేశ పరీక్షలకు అవకాశం

బెంగళూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సింబయోసిస్ ఇంటర్నేషనల్ (డీమ్డ్ యూనివర్సిటీ) తన సింబయోసిస్ ఎంట్రెన్స్‌టెస్ట్ (ఎస్ఈటీ), సింబయోసిస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ ఎంట్రెన్స్ ఎగ్జామ్ (ఎస్ఐటీఈఈఈ) కు ఈనెల 12తో నమోదు ముగియనుంది. ఈ రెండు పరీక్షలు ఆప్టిట్యూడ్ ఆధారిత, కంప్యూటర్ బేస్ట్ టెస్ట్‌గా ఉన్నాయి. యూనివర్సిటీ బీబీఏ, బీసీఏ, బీఏ, బీఎస్‌సీ, బిటెక్‌లతో కూడిన యూజీ కోర్సులు నిర్వహిస్తోంది. అభ్యర్థులు రెండు టెస్ట్‌లను ఎంపిక చేసుకోవచ్చునని, ఎక్కువ వచ్చిన మార్కులను పర్సంటైల్ ఆధారంగా పరిగణించబడుతాయని మరిన్ని వివరాలకు వెబ్‌సైట్‌ను సందర్శించాలని ప్రకటనలో పేర్కొన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1588.88	1,580.33
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	10,348	926
నీటి నిల్వ (టీఎంసీలు)	10.12	4.63

12న జోడు రథోత్సవం



విరూపాక్షేశ్వరస్వామి ఆలయం

బళ్లారి సిటీ/కంప్లి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): హంపిలోని విరూపాక్షేశ్వరస్వామి, చంద్రమౌళేశ్వర స్వామి జోడు బ్రహ్మరథోత్సవం 12వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి హనుమంతప్ప తెలిపారు. హంపి జాత్ర మహోత్సవం 6 నుంచి 14వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. హంపి ప్రధాన అర్చకులు విద్యారణ్య భారతి స్వామీజీ ఆధ్వర్యంలో 12న జోడు బ్రహ్మరథోత్సవం ఉంటుందన్నారు. శ్రీ కృష్ణదేవరాయలు సమర్పించిన బంగారు కిరీటాన్ని 10 నుంచి 14వ తేదీ వరకు స్వామివారికి అలంకరిస్తామని తెలిపారు. భక్తులకు, భోజనం, ప్రసాదం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

సీతారాముల కల్యాణానికి ఆహ్వానం



ఎస్పీకి ఆహ్వానపత్రిక అందజేస్తున్న సభ్యులు

బళ్లారిరూరల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): నగరంలోని అభయాంజనేయస్వామి ఆలయంలో 6వ తేదీన నిర్వహించనున్న సీతారాముల కల్యాణానికి ఎస్పీ శోభారాణికి ఆలయ కమిటీ సభ్యులు బుధవారం ఆహ్వానపత్రికను అందజేశారు. కమిటీ అధ్యక్షులు ధనుంజయ ఎస్పీని కలిసి స్వామివారి కల్యాణానికి హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు భీమేష్, కార్పొరేటర్ కవిత వన్నప్ప, రెడ్డి రఘు, ఆలయ కమిటీ పదాధికారులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు

- తండ్రి, ఇద్దరు కుమారుల మృతి
- భార్య, మరో వ్యక్తికి గాయాలు



బోల్తాపడిన కారు

బళ్లారి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): చిత్రదుర్గం జిల్లా మొలకాల్మూరు సమీపంలో బెంగళూరు నుంచి రాయచూరుకు వెళుతున్న కారు బొమ్మక్కనహళ్లి గ్రామంలో మసీదు వద్ద జాతీయ రహదారిపై మంగళవారం డివైడర్‌ను ఢీకొంది. కారు నడుపుతున్న బెంగళూరు కుంబరహళ్లికి చెందిన మౌలా అబ్దుల్ రహీమ్ సాబ్ (42), అతని కుమారులు రెహమాన్(15), సమీర్ (10) మృతి చెందారు. మౌలా, రెహమాన్, సమీర్, ఫాతిమా బేగం, సలీమా బేగం కారులో యాదగిరికి వెళుతున్నారు. మార్గమధ్యలో బొమ్మక్కనహళ్లి గ్రామ సమీపంలో రోడ్డు మధ్యనున్న డివైడర్‌ను కారు ఢీకొట్టింది. ప్రమాదంలో కారు దాదాపు 70 అడుగుల మేర ఎగిరి బోల్తాపడింది. కారులో ఉన్న మౌలా, రెహమాన్ అక్కడికక్కడే మృతి చెందగా, సమీర్ బళ్లారి విమ్స్‌లో చికిత్స పొందుతూ మృతిచెందాడు. గాయపడిన ఫాతిమాబేగం (75), సలీమాబేగం (36)ను వీఐఎంలో చేర్చారు. రాంపురం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.



మాట్లాడుతున్న ఎస్పీ శోభారాణి



గౌరవ వందనం చేస్తున్న పోలీసులు

పోలీసుల సేవలు అభినందనీయం

ఎస్పీ శోభారాణి

బళ్లారి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): సమాజంలో పోలీసుల సేవలు అభినందనీయమని ఎస్పీ శోభారాణి కొనియాడారు. బుధవారం నగరంలోని పోలీసు పరేడ్ మైదానంలో జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పోలీసు జెండా దినోత్సవ కార్యక్రమానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. ప్రజా ఆస్తుల పరిరక్షణకు అంకితం చేయబడి దైనందిన జీవితంలో శాంతి, సామరస్యాన్ని కొనసాగించడంలో పోలీసు అధికారులు, సిబ్బంది అందించిన సాహసం, నిస్వార్థ సేవను స్మరించుకునే రోజు ఇదన్నారు. జిల్లాలో మొత్తం 37 మంది పోలీసు అధికారులు, సిబ్బంది స్వచ్ఛంద పదవీ విరమణ పొందనున్నారు. ఇందులో పీఎస్ఐలు ఏడుగురు, ఆర్ఎస్ఐ ఇద్దరు, ఏఎస్ఐలు 13మంది, ఏఆర్ఎస్ఐ తొమ్మిది, సీఐడీసీపీ ముగ్గురు, ఎస్‌బీఏ ఇద్దరు, ఏఏవో ఒకరు పదవీ విరమణ పొందారన్నారు. 2024-25 సంవత్సరానికి గాను 178 మంది పోలీసు అధికారులు, సిబ్బందికి రూ.లక్ష నగదు రివార్డు అందజేసినట్లు తెలిపారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కుడితిని రిటైర్డ్ ఎస్ఐ విరుపాక్షి జెండా వందనాన్ని స్వీకరించి మాట్లాడారు. ముందుగా విరుపాక్షి పోలీసు బలగాల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పథక ఉద్యమం జరిగింది. పోలీసు జెండాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పదవీ విరమణ పొందిన పోలీసులను సన్మానించారు. రవి కుమార్, ఎస్ నవీన్‌కుమార్, జిల్లా జైలు సూపరింటెండెంట్ లత, డీఏఆర్ డీవైఎస్పీ తిప్పేస్వామి, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

5, 6 తేదీల్లో కేఆర్ఎస్ పార్టీ యువ నాయకత్వ శిబిరం

బళ్లారి సిటీ, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): తమకూరు దేవరాయనదుర్గంలో ఈనెల 5, 6 తేదీల్లో కేఆర్ఎస్ పార్టీ యువ నాయకత్వ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు పార్టీ జిల్లాధ్యక్షుడు యుగంధర్, ప్రధాన కార్యదర్శి ప్రకాశ్ రెడ్డి కొర్లగుంది తెలిపారు. నగరంలోని పత్రికా భవన్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే విరాళాలతో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇక్కడకు వచ్చేవారికి ఆహారం, వసతి కల్పిస్తున్నామన్నారు. రూ.309 ప్రవేశ రుసుం ఉంటుందన్నారు. పేర్లను నమోదు చేసుకోవడానికి 7619353525, 8749065597 నంబర్లలో సంప్రదించాలన్నారు. శిబిరంలో మీ చుట్టూ ఉన్న సమకాలీన సమస్యలను దీటుగా ఎలా ఎదుర్కొవాలి, ప్రస్తుత రాజకీయ ఆలోచనలు, స్ఫూహతో కూడిన నిజాయితీ గల రాజకీయాలు, నాయకత్వ అర్థం తదితర వాటిపై శిక్షణ ఉంటుందన్నారు. దేశంలోని యువత ఇటువంటి శిబిరాల్లో పాల్గొనడం చాలా ముఖ్యం అన్నారు. గత సంవత్సరం 60 మంది పాల్గొన్నారు. ఈ సంవత్సరం 50 మంది నమోదు చేసుకున్నారు. దాదాపు వంద మంది పాల్గొంటారని ఆశిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా కార్యదర్శులు కట్టెబసప్ప, డాక్టర్ మంజునాథ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేఆర్ఎస్ పార్టీ ప్రముఖులు

మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే గణేష్

కంప్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కంప్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గణేష్ మానవత్వాన్ని చాటుకున్నారు. ఇటీవల కంప్లి కోటలో ఐశ్వర్య, మారుతి దంపతులకు పుట్టిన చిన్నారికి హృదయంలో మూడు రంధ్రాలుఏర్పడ్డాయి. చిన్నారికి మెరుగైన చికిత్స చేయించాలని డాక్టర్లు చెప్పగా దంపతులు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడటంతో పొరుగువారు వెంటనే ఎమ్మెల్యేని కలవండని చెప్పారు. వెంటనే దంపతులు కంప్లిలో ఉన్న ఎమ్మెల్యేను ఆయన నివాసంలో కలిసి చిన్నారికి కావలసిన చికిత్స విషయంపై చర్చించారు. వెంటనే ఎమ్మెల్యే చిన్నారిని తమ వద్దకు తీసుకుని బెంగళూరులోని డాక్టర్‌కు ఫోన్ ద్వారా సంప్రదించారు. చిన్నారికి కావాల్సిన చికిత్స చేయాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు తమను ఒక నాయకుడిగా ఎన్నుకున్నారన్నారు. ప్రజలకు కష్టాలు వస్తే తాము వారికి అందుబాటులో ఉంటామన్నారు. వారి కష్టాలు కూడా తమ కష్టాలుగా భావించి పరిష్కరిస్తామని తెలిపారు.



చిన్నారి చికిత్స గురించి ఎమ్మెల్యేతో చర్చిస్తున్న తల్లిదండ్రులు

ఘనంగా దేవర దాసిమయ్య జయంతి



దాసిమయ్య చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న అధికారులు

తోరణగల్లు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సండూరు తాలుకా కార్యాలయంలో నేకార ఒక్కుట సమాజం వారు, తాలుకా కార్యాలయ అధికారులు వచనకారులు దేవరదాసిమయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. దాసిమయ్య చిత్రపటానికి విశేష అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. సమాజ పదాధికారులు ఉమాపతి రంగయ్య, జక్కా తిప్పయ్య స్వామి, శ్రీధర్, గంగాధర, ఉమామహేష్, రంగప్ప, తాలుకా కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కంప్లి: సమసమాజ నిర్మాణానికి తొలి ప్రబోధకుడు దేవర దాసిమయ్య అని తహసీల్దార్ శివరాజు అన్నారు. బుధవారం సంగచౌడేశ్వరి ఆలయంలో దేవాంగ సమాజం తాలూకా పాలకవర్గం ఆధ్వర్యంలో దాసిమయ్య 1048వ జయంత్యుత్సవాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. దేవర దాసిమయ్య తొలి వచన రచయిత అని, వచన సాహిత్యాన్ని ప్రారంభించి కన్నడ సాహిత్యానికి విశేష కృషి చేశారన్నారు. ఆయన సూత్రాలు, ఆదర్శాలను ప్రతి ఒక్కరు స్వీకరించాల్సిన అవసరం వుందని అన్నారు. దేవాంగ సమాజ మాజీ కార్యదర్శి బంగి దొడ్డ మంజునాథ దాసిమయ్య అనే అంశంపై ఉపన్యాసం ఇచ్చి, పదవ శతాబ్దంలో సమాజాన్ని సృష్టించడానికి లింగ సమానత్వం, వృత్తి, కుల సమానత్వం, భక్తి, పనిలో శ్రేష్టత గురించి ప్రజల్లో అవగాహన కల్పించడానికి అవిశ్రాంతంగా కృషి చేశారన్నారు. 2వ జాతీయ స్థాయి ఓపెన్ కరాటే పోటీల్లో ప్రథమ బహుమతి సాధించిన బంగి దొడ్డ మంజునాథ్‌లను దేవాంగ సమాజం, నేకార కమ్యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. దేవాంగ మఠం మంజునాథస్వామి, దేవాంగ సమాజం అధ్యక్షులు సప్పరద రాఘవేంద్ర నేత సంఘాల సంఘం అధ్యక్షులు బ్రహ్మయ్య, ప్రముఖులు మిట్టి శంకర్, సుధాకర్, విరుపాక్షి, మాగనూరు, రాజేశ్వరమ్మ, దూపాడ సుభాశ్చంద్ర, ప్రశాంత, ఎం శ్రీనివాస, శంకర్, తులసి, సుబ్బన్న, అంజి పాల్గొన్నారు.

సిరుగుప్ప: దేవర దాసిమయ్య తత్వ సిద్ధాంతాలను పాటించాలని బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్ మల్లికార్జున అన్నారు. బుధవారం పట్టణ శిశు అభివృద్ధి యోజన కార్యాలయంలో తాలుకా పరిపాలన, బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దాసిమయ్య జయంతిని నిర్వహించారు. ఆయన భావ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మల్లికార్జున మాట్లాడుతూ ఆయన రచించిన సాహిత్యాలు నేటికీ మరువరానివని కొనియాడారు. కార్యక్రమంలో శిశు అభివృద్ధి యోజన అధికారి ప్రదీప్, బీసీ సంక్షేమ శాఖ సూపర్‌వైజర్లు, వార్డెన్లు, రెవెన్యూ అధికారులు, నేకార సమాజం సభ్యులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.



సిరిగుప్పలో జ్యోతి వెలిగించి, కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్ మల్లికార్జున

హోసూరు జోన్

మరియమ్మన్ రథోత్సవం

హోసూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): బాగలూరులోని మరియమ్మన్ ఆలయ రథోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. సుమారు వెయ్యి సంవత్సరాల పురాతన ఆలయ ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి విశేషపూజలు నిర్వహించారు. మేయర్ సత్య, మాజీ మంత్రి బాలకృష్ణారెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు రవి, యూనియన్ కార్యదర్శి గజేంద్రమూర్తి, పంచాయతీ మాజీ అధ్యక్షుడు మురళిబాబు, మాజీ కౌన్సిలర్ నాగరాజ్ తదితరులు ఉత్సవంలో పాల్గొన్నారు. భక్తుల గోవింద నామస్మరణ మధ్య రథోత్సవం సాగింది. రథోత్సవం సందర్భంగా భక్తులు రథంపై అరటిపండ్లు, ఉప్పు, మిరియాలు వేసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు మజ్జిగ, నీరు వంటివి స్థానికులు పంపిణీ చేశారు. టిప్పు సుల్తాన్ తట్కా కమిటీ, స్థానిక ముస్లింలు భక్తులకు పుచ్చకాయ, నీరు, మజ్జిగ వంటివి పంపిణీ చేయడం విశేషం. తద్వారా ప్రజల మధ్య సామరస్యం పెంపొందించేందుకు ఉత్సవాలు దోహదపడతాయని పలువురు అభిప్రాయపడ్డారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

స్కైవాక్ ఏర్పాటు చేయండి

హోసూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): బెంగళూరు-చెన్నై జాతీయ రహదారిపై పాతాల స్కూల్ వద్ద స్కైవాక్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రదేశంలో రోడ్డు దాటేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎంఎస్ఆర్‌నగర్ ఎదురుగా జూజువాడి వద్ద, సీతారామయ్యమేడు వద్ద స్కైవాక్ ఏర్పాటు చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో రద్దీగా ప్రదేశంలో కూడా స్కైవాక్ ఏర్పాటు చేయాలని విద్యార్థులు, ప్రయాణికులు కోరుతున్నారు.



రోడ్డు దాటుతున్న ప్రజలు

పుట్టగొడుగుల పెంపకంపై రైతులకు శిక్షణ



శిక్షణలో పాల్గొన్న రైతులు

హోసూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): శూలగిరి సమీపంలోని అత్తిముగంలోని ఆదియమాన వ్యవసాయ కళాశాలలో పుట్టగొడుగుల పెంపకంపై రైతులకు సాంకేతిక శిక్షణ, ప్రదర్శనలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధరన్ తర్ఫీదును ప్రారంభించి ప్రత్యేక ప్రసంగం చేశారు. 50మందికిపైగా రైతులు శిక్షణలో పాల్గొన్నారు. పుట్టగొడుగుల సాగుకు ప్రభుత్వం అందించే రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్, క్రాప్ పాథాలజీ విభాగం డాక్టర్ రాజశేఖర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ తదితరులు పాల్గొన్నారు.

టాస్మాక్ దుకాణంలో చోరీ

హోసూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): డెంకణీకోట ప్రాంతం తిమ్మసంద్రలోని టాస్మాక్ మద్యం దుకాణంలో దొంగలు పడ్డారు. సుమారు లక్షన్నర రూపాయల విలువైన మద్యం, బీరుబాటిళ్లు చోరీకి గురయ్యాయి. మంగళవారం రాత్రి అమ్మకాలు ముగించుకుని దుకాణానికి తాళం వేశారు. బుధవారం ఉదయం అటుగా వెళ్తున్నవారు టాస్మాక్ దుకాణం గోడకు రంధ్రం ఉండడాన్ని చూసి దుకాణ సేల్స్‌మ్యాన్, డెంకణీకోట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



మద్యం దుకాణం వద్ద పోలీసుల విచారణ

జెండాల అమ్మకంతో రూ.24.48 లక్షల ఆదాయం



గౌరవ వందనం స్వీకరిస్తున్న పోలీసు అధికారులు

బళ్లారి సిటీ, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లాలో 2024-25 సంవత్సరంలో పోలీసు జెండాల అమ్మకం ద్వారా రూ.24.48 లక్షల నిధి సేకరించినట్లు పోలీసు సూపరింటెండెంట్ శ్రీహరిబాబు తెలిపారు. పదవీవిరమణ చేసిన పోలీసు అధికారులు, సిబ్బంది సంక్షేమ నిధికి, కేంద్ర సంక్షేమ నిధికి జమ చేశామన్నారు. బుధవారం స్థానిక పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన పోలీసు జెండా దినోత్సవ వేడుకల్లో గత సంవత్సరం నివేదికను చదివి వినిపించిన ఆయన పోలీసు సంక్షేమ నిధిలో రూ.33.50లక్షలు, రిటైర్డ్ పోలీసు అధికారుల సంక్షేమ నిధిలో రూ.24.86లక్షల డిపాజిట్లు ఉన్నాయన్నారు. ఏడాది కాలంలో 35 మంది పదవీ విరమణ చేసిన పోలీసు అధికారులు, సిబ్బంది వారి కుటుంబాలు ఆరోగ్య భాగ్య పథకం కింద చికిత్స పొందినట్లు ఆయన అన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన రిటైర్డ్ పీఎస్ఐ ఎం.మునిరత్నం మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన విజయనగరం జిల్లాలో పోలీస్ క్యాంటీన్ ఏర్పాటు చేయాలని కోరారు. మరో రిటైర్డ్ పీఎస్ఐ మాలిక్ సాహెబ్ మాట్లాడుతూ ప్రజా జీవితంలో దుర్గుణాలకు దూరంగా ఉన్నంత కాలం పోలీసు అధికారులు తమ విధులను నిజాయితీగా నిర్వహించే అవకాశం ఉంటుందన్నారు. అంతకుముందు మునిరత్నం బహిరంగ వాహనం నుంచి కవాతును పరిశీలించి నాలుగు బృందాల నుంచి గార్డ్ ఆఫ్ హానర్‌ను స్వీకరించారు. జాతీయ జెండా, పోలీస్ జెండాలతో కూడిన భారీ ఊరేగింపు నిర్వహించారు.

ట్రాఫిక్ సీఐకి సీఎం మెడల్



కుటుంబ సభ్యులతో సీఐ అయ్యనగౌడ పాటిల్

బళ్లారిరూరల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన సేవలందించిన బళ్లారి ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అయ్యన్నగౌడ పాటిల్‌కు సీఎం మెడల్ అందుకున్నారు. నగరంలోని పోలీస్ డీఆర్ గ్రౌండ్ సభా ప్రాంగణంలో పోలీసు ధ్వజ కార్యక్రమంలో అయ్యనగౌడ పాటిల్‌కు మెడల్ అందించారు. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చి పోలీస్ సేవా విభాగంలో 2005లో ఉద్యోగంలో చేరారు. అయ్యన్న బళ్లారి జిల్లా మోకా, కొప్పాల్ జిల్లాలో, రాయచూరు జిల్లా మందగల్‌లో, మస్కి పోలీస్ స్టేషన్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా ఉత్తమ సేవలందించి సీఐగా 2016లో పదోన్నతి పొందారు. ఆ తరువాత బాగల్ కోట ముధోల్, కొనగుండ్ల పోలీస్‌స్టేషన్లో కొన్ని నెలలు సీఐగా పనిచేశారు. బుధవారం సీఎం గోల్డ్ మెడల్‌ను ఎస్పీ శోభారాణి చేతుల మీదుగా అందుకున్నారు. సీఐని పలువురు పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.

సిరుగుప్ప సీఐకి...



సీఐ హనుమంతప్ప

బళ్లారిరూరల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): సిరుగుప్ప పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సీఐ వైఎస్ హనుమంతప్పకు ఉత్తమ సేవలు అందించిన నేపథ్యంలో సీఎం గోల్డ్ మెడల్‌ను అందించారు. హనుమంతప్ప దావణగేరి జిల్లా నరసగుండనహళ్లి గ్రామంలో శాంతరాజు, సరస్వతమ్మలకు జన్మించారు. 2010 బ్యాచ్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా నియమితులయ్యారు. బళ్లారి జిల్లా కమలాపురం, ఏపీఎంసీ, పరమదేవనహళ్లి, రూరల్ పోలీస్ స్టేషన్లో అనంతరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొందారు. సీఐ అయిన తరువాత హోస్పేట ఎస్పీ కార్యాలయంలో, ఐఎస్‌డీలో పనిచేశారు. అనంతరం సిరుగుప్ప సీఐగా పనిచేస్తున్నారు. ఆయన ప్రతిచోట ప్రజలకు అనుకూలమైన పోలీసు అధికారిగా ప్రతిచోట ఉత్తమ సేవలందించారు. బుధవారం బళ్లారి నగరంలోని పోలీసు పరేడ్ మైదానంలో ఎస్పీ శోభారాణి చేతుల మీదుగా సీఎం మెడల్‌ను అందుకున్నారు. ఆయనకు పలువురు శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు.

మహిళలు సాధికారత సాధించాలి: సాహిరాబాను



మొక్కకు నీరు పోసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సాహిరా బాను

బళ్లారి సిటీ, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): స్వయం సమృద్ధిని సాధించడం ద్వారా మహిళలు సాధికారత సాధించాలని కాంగ్రెస్ మహిళా కమిటీ జిల్లా అధ్యక్షురాలు సాహిరా బాను సూచించారు. విజయనగరం జిల్లా కాంగ్రెస్ కమిటీ మహిళా బిభాగం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా మహిళలు ఇతరులకు ఆదర్శంగా నిలిచారన్నారు. స్వయం ఉపాధి ద్వారా విజయం సాధించిన వ్యక్తుల ఉదాహరణలు చాలా ఉన్నాయని, భయం లేకుండా ధైర్యంగా ముందుకు సాగినప్పుడే విజయం సాధించగలమని అన్నారు. కేపీసీసీ అధికార ప్రతినిధి పత్రేశ్ హిరేమఠ్, బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కోరి గోనిబసప్ప, మున్సిపాలిటీ ఉపాధ్యక్షురాలు అంబికా దేవేంద్ర, సభ్యులు రేష్మా సికందర్, ఖాజాముున్ని అల్లాభక్షి, తాలూకా మహిళా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు యశోదమ్మ, మాజీ అధ్యక్షురాలు నాగమ్మ పాల్గొన్నారు.

వీరేశ్ మృతిపై సీఐడీ విచారణ

- బళ్లారి రేంజ్ ఐజీ జీఎస్ లోకేశ్ వెల్లడి



మాట్లాడుతున్న ఐజీ జీఎస్ లోకేశ్

రాయచూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఈశ్వర్ నగర్‌కు చెందిన వీరేశ్ పోలీసులు దాడి చేయడంతో మృతి చెందాడని వస్తున్న ఆరోపణల నేపథ్యంలో కేసును సీఐడీ విచారణకు అప్పగించామని బళ్లారి రేంజ్ ఐజీ జీఎస్ లోకేశ్ తెలిపారు. బుధవారం నగరంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వీరేశ్ మృతికి బాధ్యులుగా వెస్ట్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్, ఎస్ఐలను సస్పెండ్ చేసినట్లు తెలిపారు. నిష్పక్షపాతంగా విచారణ కోసం సీఐడీకి ఇప్పగించామని వారి నివేదిక వచ్చిన అనంతరం నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈశ్వర్ నగర్‌కు చెందిన భార్యాభర్తలు గొడవపడగా 112కు ఫోన్ ద్వారా వచ్చిన సమాచారం మేరకు వీరేశ్‌ను స్టేషన్‌కు రప్పించిన పోలీసులు అతనిపై దాడి జరిపారన్నది ఆరోపణ కాగా దీనిపై కూడా సీఐడీ విచారణ జరుపుతుందన్నారు. విచారణ గురువారం నుంచే ప్రారంభిస్తున్నట్లు ఐజీ తెలిపారు. కాగా తుర్విహాళ్ వద్ద వన్యప్రాణులను వేటాడి మారణాయుధాలు చేతపెట్టి ఊరేగింపు జరిపిన మస్కి ఎమ్మెల్యే కుమారుడు సోదరుడిపై అటవీ శాఖ అధికారులు కేసు నమోదు చేశారని ఐజీ వివరించారు. ఈ విషయంలో అటవీ శాఖ వారు నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటారన్నారు. వన్య ప్రాణి సంరక్షణ చట్టాల ఆధారంగా వారిపై చర్యలు ఉంటాయన్నారు. జిల్లాలో సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రత్యేక పోలీస్ స్టేషన్‌లను ఏర్పాటు చేసి డీఎస్పీ స్థాయి అధికారులకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఐజీ తెలిపారు. బళ్లారి రేంజ్ పరిధిలో పోలీసు శాఖలో ఖాళీల గురించి ప్రస్తావించిన ఐజీ త్వరలోనే 51 మంది పీఎస్ఐలను భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు.